కోటగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో..
వీక్షించండి చానల్
NS99 CHANNEL
దగా స్థానంలో నిగా వేసే చానల్

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

నీలగిరి శంఖారావం

సమగ్ర సమాచార దర్శిని

తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ | సంపుటి :05 | సంచిక :179 | ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ | శుక్రవారం 06-11-2026 | పేజీలు : 4 | వెల : రూ. 3/-

హైదరాబాద్ మెట్రో,ఆర్టీసీ కామన్ పాస్ ధరలను తగ్గించనున్న ప్రభుత్వం



హైదరాబాద్:నగర ప్రయాణికులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పేందుకు సిద్ధమవుతోంది. మెట్రో రైలు, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు ఇటీవల ప్రవేశపెట్టిన కామన్ పాస్ ధరలను భారీగా తగ్గించాలని నిర్ణయించింది. ప్రస్తుత ధరలు చాలా అధికంగా ఉన్నాయని ప్రయాణికుల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్ నేపథ్యంలో ప్రభుత్వం ఈ దిశగా చర్యలు చేపట్టింది. సవరించిన ధరలు దీపావళి నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ కామన్ పాస్ ధరలు ప్రయాణికులకు భారంగా మారాయి. రోజువారీ పాస్ కోసం రూ.400, నెలవారీ పాస్ కోసం ఏకంగా రూ.8,500 చెల్లించాల్సి వస్తోంది. దీంతో ఈ పాస్‌పై ప్రజల నుంచి ఆశించిన స్పందన రాలేదు. ఈ విషయాన్ని గుర్తించిన అధికారులు, ధరలను సవరించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. తాజా నివేదికల ప్రకారం రోజువారీ పాస్ ధరను రూ.400 నుంచి రూ.325కు తగ్గించనున్నారు. అదేవిధంగా, నెలవారీ పాస్ ధరను రూ.8,500 నుంచి సుమారు రూ.4,000 – రూ.4,500 మధ్యకు తీసుకురావాలని భావిస్తున్నారు. ఇది అమలైతే నెలవారీ పాస్ ధర దాదాపు సగానికి తగ్గుతుంది. ఈ ఉమ్మడి పాస్‌ను అక్టోబర్ ప్రారంభంలో ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభించింది. ఈ పాస్ ద్వారా ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) పరిధిలో మెట్రో రైళ్లు, ఆర్టీసీ సిటీ బస్సుల్లో (పుష్పక్ ఏసీ సర్వీసులు మినహా) అపరిమితంగా ప్రయాణించే సౌకర్యం ఉంటుంది. నగరంలో ప్రజా రవాణాను ప్రోత్సహించి, ప్రైవేట్ వాహనాల వినియోగాన్ని తగ్గించాలనే లక్ష్యంతో ఈ పాస్‌ను ప్రవేశపెట్టారు. అయితే, ధరలు ఎక్కువగా ఉండటంతో ఆ లక్ష్యం నెరవేరలేదు. ధరల సవరణపై ఇప్పటికే మెట్రో, ఆర్టీసీ అధికారులు పలుమార్లు సమావేశమై చర్చలు జరిపారు. ప్రభుత్వ ఉన్నతాధికారులతో జరగనున్న తదుపరి సమావేశాల అనంతరం కొత్త ధరలపై పూర్తి స్పష్టత రానుంది. ఈ నిర్ణయంతో కామన్ పాస్‌ను వినియోగించే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతుందని, నగరంలో ట్రాఫిక్ రద్దీ తగ్గడానికి ఇది దోహదపడుతుందని అధికారులు ఆశిస్తున్నారు.

జంతర్ మంతర్ నిరసనలు.. సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు



న్యూఢిల్లీ,కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన నిరసనల్లో చోటుచేసుకున్న హింస, పోలీసుల అతిక్రమణలపై దర్యాప్తు జరుపుతున్న సుప్రీంకోర్టు ఉన్నత స్థాయి విచారణ కమిటీ కి బాధితుల నుంచి ఇప్పటివరకు పెద్దగా ఎలాంటి ఫిర్యాదులూ అందలేదని అత్యున్నత న్యాయస్థానానికి ఇవాళ సమాచారం అందించారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ అంశంపై విచారణ చేపట్టింది. జూలై 20న జరిగిన నిరసనల్లో చోటుచేసుకున్న హింసపై తగిన ఆధారాలు, సమాచారం లేకపోవడం వల్ల మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలోని నూజుజ కమిటీ ప్రస్తుతానికి ఏ నిర్ణయానికి, నిర్ధారణకు రాలేకపోతోందని ధర్మాసనం వెల్లడించింది.

కమిటీకి పిటిషన్లు, ఆధారాల బదిలీ..

బాధితులు, సాక్షుల నుంచి తగిన ఆధారాలు లభించకపోవడాన్ని గమనించిన సుప్రీంకోర్టు, ఈ సంఘటనకు సంబంధించిన అన్ని పిటిషన్లు, లభ్యమైన వీడియో ఫుటేజ్‌లుచ, ఫిర్యాదులను తక్షణమే విచారణ కమిటీకి బదిలీ చేయాలని ఆదేశించింది. హింసాత్మక ఘటనలపై విచారణ జరుపుతున్న ఈ హై-పవర్డ్ ఎంక్వైరీ కమిటీలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తితో పాటు పంజాబ్, హర్యానా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రవి శంకర్ ఝా, ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ షాలిందర్ కౌర్, సీబీఐ మాజీ డైరెక్టర్ రిషి కుమార్ శుక్లా, మేఘాలయ విశ్రాంత డీజీపీ ఎల్ఆర్ బిష్ణోయ్ సభ్యులుగా వ్యవహరిస్తున్నారు. బదిలీ చేసిన సమాచారం ఆధారంగా కమిటీ తదుపరి విచారణను ముమ్మరం చేయనుంది.

టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు!



హైదరాబాద్,తెలంగాణలో అక్రమ నిర్మాణాలు, ప్రభుత్వ భూముల వ్యవహారాలు, సమాచార హక్కు చట్టం అమలు తీరుపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులపై సంచలన ఆరోపణలు చేశారు. హైదరాబాద్‌లోని ఖానామెట్ అయ్యప్ప సొసైటీలో హైకోర్టు ఆదేశాలను సైతం పట్టించుకోకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి ఇంటికి కేవలం రెండు అడుగుల దూరంలోనే ఈ వ్యవహారాలు జరుగుతున్నాయని, అయినా ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. గురువారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.

500 నుంచి 700 అక్రమ భవనాలు!

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అయ్యప్ప సొసైటీ పరిసర ప్రాంతాల్లో పెద్దఎత్తున అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని కవిత ఆరోపించారు. సర్వే నంబర్లు 11, 18 నుంచి 44 వరకు వరుసగా నిర్మాణాలు చేపడుతున్నారని, మొత్తం 500 నుంచి 700 వరకు అక్రమ భవనాలు నిర్మించినట్లు పేర్కొన్నారు. సర్వే నంబర్ 12లో ఏకంగా 12 అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారని ఆరోపించారు. హైకోర్టు ఆదేశాలు అమల్లో ఉన్నప్పటికీ ఇలాంటి నిర్మాణాలకు అనుమతులు ఎలా లభిస్తున్నాయని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై రాజకీయ పార్టీలు ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు.

సీఎం కుటుంబ సభ్యులపై ఆరోపణలు

అయ్యప్ప సొసైటీలో జరుగుతున్న అక్రమ నిర్మాణాల వెనుక ముఖ్యమంత్రి కుటుంబ సభ్యుల ప్రమేయం ఉందని కవిత ఆరోపించారు. ముఖ్యమంత్రి సోదరులే దగ్గరుండి నిర్మాణాలకు అనుమతులు ఇప్పిస్తూ అక్రమంగా సంపాదిస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి ఇంటికి సమీపంలోనే ఇంత పెద్దఎత్తున అక్రమాలు జరుగుతుంటే ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.'కాంగ్రెస్ నడుపుతున్నది ప్రభుత్వమా? రౌడీ రాజ్యమా?' అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. అయ్యప్ప సొసైటీలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను తక్షణమే నిలిపివేయాలని ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు.

మీడియాను బెదిరిస్తున్నారంటూ..

అయ్యప్ప సొసైటీలోని అక్రమ నిర్మాణాలపై ఓ వార్తాపత్రిక గూగుల్ మ్యాప్ ఆధారాలతో సహా కథనం ప్రచురించిందని కవిత తెలిపారు. అయితే ఈ వ్యవహారాన్ని వెలుగులోకి తెచ్చిన మీడియా ప్రతినిధులను అక్కడి నిర్మాణాల యజమానులు బెదిరిస్తున్నారని ఆరోపించారు. తమ వెనుక ప్రభుత్వం ఉందంటూ మీడియా వారిని భయపెడుతున్నారని పేర్కొన్నారు. అక్రమ నిర్మాణాలపై వార్తలు రాసే మీడియా సంస్థలకు, జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని పరోక్షంగా ప్రభుత్వాన్ని కోరారు.

పేదల ఇళ్ల కూల్చివేతలు.. పెద్దల నిర్మాణాలపై మౌనం ఎందుకు?

మంథని నియోజకవర్గంలోని శాత్రాజుపల్లి గ్రామంలో బొగ్గు గని ఏర్పాటు కోసం కనీసం సర్వే కూడా నిర్వహించకముందే అర్ధరాత్రి సమయంలో 374 ఇళ్లను కూల్చివేశారని కవిత ఆరోపించారు. పేదల ఇళ్ల విషయంలో మాత్రం వేగంగా చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం, హైదరాబాద్‌లో పెద్దఎత్తున అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు.వ్యాపారవేత్తలకు అనుకూలంగా వ్యవహరిస్తూ పేదలపై ప్రతాపం చూపుతున్నారని విమర్శించారు. హైకోర్టు ఆదేశాలను పక్కనపెట్టి అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నారని ఆరోపించారు. చట్టం అందరికీ సమానంగా వర్తించాలన్న ఆమె, అక్రమ నిర్మాణాలపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆర్టీఐలో 18 వేల దరఖాస్తులు పెండింగ్!

రాష్ట్రంలో సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) అమలు తీరు పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని కవిత విమర్శించారు. ఆర్టీఐ కింద సమాచారం కోరుతున్నప్పటికీ అధికారులు సమాధానాలు ఇవ్వడం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 18 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. పెండింగ్ దరఖాస్తులపై ఒత్తిడి పెరగడంతో ఒకే జిల్లాలో 800 దరఖాస్తులకు ఒకరోజులో సమాధానం ఇవ్వలేమంటూ అధికారులు చేతులెత్తేశారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సమాచార హక్కు చట్టం ఉండి ఏం ప్రయోజనమని ప్రశ్నించారు. అయ్యప్ప సొసైటీలోని నిర్మాణాలకు సంబంధించిన తాను అడిగిన సమాచారాన్ని అధికారులు తప్పనిసరిగా అందించాలని డిమాండ్ చేశారు.

రామగుండం ఎమ్మెల్యే, సీఐలు నియంత పోకడలు తగ్గించుకోవాలి..



గోదావరిఖని, నవంబర్ 5 : రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్, గోదావరిఖని వన్ టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి నియంత పోకడలు తగ్గించుకోవాలని, లేదంటే కమ్యూనిస్టుల నుంచి ప్రతిఘటన తప్పదని సీపీఐ జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడా వెంకటరెడ్డి స్పష్టం చేశారు. కూల్చివేతల బాధితులకు న్యాయం చేయాలని ఇటీవల గోదావరిఖని చౌరస్తాలో శాంతియుతంగా నిరసన తెలు పుతున్న సీపీఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య, పార్టీ కార్యకర్తలపై వన్ టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి విచక్షణరహితంగా జనం చూస్తుండగానే మెడలు పట్టి బ ట్టలు చింపి అసభ్య పదజాలంతో ఈడ్చుకెళ్లి అక్రమ కేసు బనాయించడం దు ర్మార్గపు చర్య అన్నారు. జరిగిన సంఘటనపై గురువారం పార్టీ శ్రేణులను అ డిగి తెలు సుకొన్న ఆయన తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.ప్రజా పోరాటాలలో కమ్యూ నిస్టులు ఎప్పుడూ ముందుంటారని తెలిపారు. ఎల్బీ నగర్, తిలక్ నగర్ లో 40 ఏండ్లుగా0 ఉంటున్న దుకాణాలను రోడ్డు వెడల్పు సాకుతో కూల్చివేయ డం, ఆ తర్వాత మేయర్, సింగరేణి జీఎంలు కొబ్బరికాయలు కొట్టి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమిపూజ చేయడం అంత నాటకీయమా అని ప్రశ్నిం చారు. తీరా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తయ్యాక అనుమతులు లేవని సింగరేణి అధికారులతో మల్లీ కూల్చివేయించడం విడ్డూరంగా ఉందన్నారు. దుకాణదారుల పొట్ట కొట్టినందుకు ప్రశ్నించిన సీపీఐ ప్రజాప్రతినిధిపై అక్రమ కేసు బనాయించ డం సమంజసం కాదన్నారు.ప్రజలకు అన్యాయం చేస్తామంటే చూస్తూ ఊరుకో మని హెచ్చరించారు.ఆయన వెంట సీపీఐ నాయకులు తాండ్ర సదానందం, మార్కపురి సూర్య, శనిగరపు చంద్రశేఖర్, మానస్కుమార్ తదితరులు న్నారు.

నల్గొండను సూపర్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతాం..మంత్రి!



నల్గొండ : నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ను సూపర్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. గురువారం అయన నల్గొండ జిల్లా కేంద్రంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. నల్గొండ కార్పొరేషన్ పరిధిలోని కథాల్ గూడ వద్ద 10 కోట్ల రూపాయల వ్యయంతో కథాల్ గూడా నుండి రాజీవ్ గృహకల్ప గృహ సముదాయం వరకు 3 కిలోమీటర్ల మేర చేపట్టనున్న రోడ్డు విస్తరణ ,పటిష్ట పరిచే పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.అనంతరం మంత్రి మీడియా ప్రతినిధుల తో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 25వేల కోట్ల రూపాయలతో హ్యాం రోడ్లను చేపట్టడం జరిగిందని, దేశంలో ఏ రాష్ట్రంలో ఇలాంటి రోడ్లు వేయటంలేదని, ముఖ్యంగా మండల కేంద్రం నుండి జిల్లా కేంద్రం వరకు, గ్రామాల నుండి మండల కేంద్రాల వరకు డబుల్ రోడ్లను వేస్తున్నట్లు తెలిపారు.సుమారు 9000 కిలోమీటర్ల మేర రోడ్లను నిర్మిస్తున్నామని, నల్గొండ జిల్లాలో 2000 కోట్ల రూపాయలతో డబుల్ రోడ్లు నిర్మించనున్నట్లు మంత్రి వెల్లడించారు.రహదారుల అభివృద్ధిలో భాగంగా నల్గొండ నుండి ధర్వేశిపురం వరకు ఆరు లైన్ల రహదారిని 50 కోట్ల రూపాయలతో చేపట్టడం జరిగిందని, అలాగే ధర్వేశిపురం నుండి కనగల్ వరకు హ్యాం రోడ్డు చేపట్టామన్నారు.కథాల్ గూడా రహదారి పనులను వెంటనే ప్రారంభించాలని ఆయన ఆర్ అండ్ బి అధికారులను ఆదేశిస్తూ పనులు నాణ్యతగా చేపట్టాలని చెప్పారు.నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ను సూపర్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో కార్పొరేషన్ లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు.ఇందులో భాగంగా రాష్ట్ర నిధులతో ఆర్టీసీ డిపోను పూర్తిగా ఆధునికరించడం జరిగిందని, కార్పొరేషన్ పరిధిలో ప్రతి ఇంటికి నల్లాలు ఏర్పాటు చేయడం, అలాగే 24 గంటలు తాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, వీటన్నిటిని రానున్న ఒకటిన్నర సంవత్సరాలలో పూర్తి చేస్తామని వెల్లడించారు.రోడ్లతోపాటు, నల్గొండ పట్టణంలో పేదవారికి ఇళ్ల కేటాయింపులో భాగంగా హౌసింగ్ బోర్డ్ పక్కనే స్థలాన్ని కేటాయించామని, జి ప్లస్ త్రీ మోడల్ లో 500 గృహాలను ఇల్లు లేని పేదలకు ఇల్లు కట్టించి ఇస్తామని మంత్రి వెల్లడించారు.అంతకు ముందు... మంత్రి భవిత కేంద్రం ఆవరణలో 17 కోట్ల 50 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న సమీకృత మండల కాంప్లెక్స్ భవన సముదాయ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఎం ఎల్ సి శంకర్ నాయక్, నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, డిప్యూటీ మేయర్ అమీర్ అలీ, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి ,ఆర్ అండ్ బి ఎస్ ఈ మోహన్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్ రెడ్డి, డిప్యూటీ ఇంజనీర్ గణేష్, ఆర్డిఓ వై అశోక్ రెడ్డి, ఇతర అధికారులు, మాజీ జెడ్పిటిసి గుమ్మల మోహన్ రెడ్డి, 11వ డివిజన్ కార్పొరేటర్ పాలకురి సుమలత సంతోష్ గౌడ్ ,ఇతర ప్రజాప్రతినిధులు ,తదితరులు ఉన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి అభినందనలు.. మత్స్యకారులు,సిబ్బంది సురక్షితం!



ఖమ్మం, భారీ వర్షాలతో ఉప్పొంగుతున్న బేతుపల్లి చెరువులో చోటుచేసుకున్న ప్రమాద పరిస్థితులు సురక్షితంగా ముగిశాయి. చెరువులో గల్లంతైన మత్స్యకారులను రక్షించేందుకు వెళ్లి చిక్కుకుపోయిన ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బందితో పాటు మత్స్యకారులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చేందుకు చేపట్టిన సహాయక చర్యలు విజయవంతమయ్యాయి. ఈ ఆపరేషన్‌లో కీలక పాత్ర పోషించిన ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్,అగ్నిమాపక శాఖ సిబ్బందిని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అభినందించారు.

సమన్వయంతో సహాయక చర్యలు

ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువులో భారీ వర్షాల కారణంగా నీటిమట్టం పెరిగి ప్రమాదకర పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో చెరువులో చిక్కుకున్న మత్స్యకారులను రక్షించేందుకు వెళ్లిన ఎస్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది కూడా ఇబ్బందుల్లో చిక్కుకున్నారు. పరిస్థితి తీవ్రతను గుర్తించిన అధికారులు వెంటనే ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దించారు. జిల్లా యంత్రాంగం, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టారు. చివరకు మత్స్యకారులు, సహాయక సిబ్బందిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు.

సిబ్బంది ధైర్యసాహసాలు ప్రశంసనీయం

ఈ ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందిస్తూ.. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు సహాయక బృందాలు ప్రదర్శించిన ధైర్యసాహసాలు, అంకితభావం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ వెనుకడుగు వేయకుండా బాధితులను రక్షించేందుకు సిబ్బంది చేసిన కృషిని ప్రశంసించారు.

అధికారులకు సీఎం అభినందనలు

సహాయక చర్యలను సమర్థవంతంగా నిర్వహించిన జిల్లా కలెక్టర్‌తో పాటు ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖల అధికారులు, సిబ్బందిని సీఎం ప్రత్యేకంగా అభినందించారు. విపత్తు సమయంలో వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయడం వల్లే ప్రాణనష్టం జరగకుండా సహాయక చర్యలు చేపట్టగలిగామని పేర్కొన్నారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తూ అత్యవసర పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు.

అక్రమ ఫైనాన్స్ ముఠాలపై ఉక్కుపాదం

హైదరాబాద్, నవంబర్ 05: అక్రమ ఫైనాన్స్ ముఠాలపై ఉక్కుపాదం మోపుతా మని మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ సుమతి స్పష్టం చేశారు. అక్రమ ఫైనాన్స్, అధిక వడ్డీలు, బెదిరిం పులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవ ని హెచ్చరిం చారు. అక్రమ ఫైనాన్స్, రుణాల పేరుతో మోసాలకు పాల్పడు తున్న ముఠాకు చెందిన నలుగురు నిందితులను ఎస్ఓటీ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రెండు కార్లు, 12 మొబైల్ ఫోన్లతోపాటు 25 ప్రామిసరీ నోట్లు, 22 ఖాళీ చెక్కులు, రెండు సేల్ డీడ్ల స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అలాగే రూ.47,690 నగదు, రెండు



సంపాదకీయం

శుక్రవారం 06-11-2026

భారమైన బతుకుల్లో రాజుకున్న ఆందోళనలివి

ఐరోపాలోని ఫ్రాన్స్, ఇటలీ, స్పెయిన్, అల్బేనియా, బెల్జియంలలో మొదలైన ఆందోళనలు జర్మనీ, స్విట్జర్లాండ్‌లకూ పాకాయి. బడుల్లో ఉపాధ్యాయులు, వసతుల కొరతపై ఫ్రెంచి విద్యార్థుల నిరసనగా మొదలై ఫ్రాన్స్, స్పెయిన్, ఇటలీలలో దుకాణాల లూటీకి, ఆస్తి నష్టానికి కారణమయ్యాయి. అల్లర్లకు కారకులు ఎవరనే దానిపై పలు కథనాలు, ఊహాగానాలు వినిపించాయి. వలసదారులు, శరణార్థులు లూటీలకు పాల్పడుతున్నట్లుగా నకిలీ డీప్‌ఫేక్ వీడియోలను అతివాద పార్టీల మద్దతుదారులు వ్యాపింపజేశారు. రష్యన్ గూఢచారి వర్గాలు సైతం అల్లర్లను ఎగదోస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. కానీ, ఆందోళనల వెనక అసలు కారణాలు వేరు!ఐరోపాలో చెలరేగిన ఆందోళనలు భారీ లూటీలకు దారితీస్తున్నాయి. ఫలితంగా ఒక్క ఫ్రాన్స్‌లోనే వంద కోట్ల యూరోల ఆర్థిక నష్టం వాటిల్లింది. ఇలాంటి వాటికి పరిహారాలను అల్లర్లకు పాల్పడినవారి తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తామని ఫ్రాన్స్, స్పెయిన్, ఇటలీ ప్రభుత్వాలు ప్రకటించాయి. కుటుంబాలకు అద్దె భారం తగ్గించడానికి, పిల్లలను పెంచడానికి ప్రభుత్వమిచ్చే నగదు సహాయానికి కోతపెట్టి, ఆ మొత్తాన్ని నష్టపరిహారం కింద జమచేయనున్నారు. ఫ్రాన్స్‌లో విద్యార్థులు మొదలుపెట్టిన ఆందోళన ఐరోపా అంతటా భారీ జెన్‌జీ ఉద్యమంగా రూపాంతరం చెందుతుండటాన్ని ప్రపంచమంతా ఆసక్తిగా గమనిస్తోంది.

చైనా వస్తువులతో ఉద్యోగాలకు ఎసరు

రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, ఇరాన్ యుద్ధం నేపథ్యంలో చమురు, గ్యాస్ ఎగుమతులపై అమెరికా ఆంక్షలు విధించింది. దాంతో ఐరోపా దేశాల్లో ఆర్థిక నష్టాలు ఏర్పడ్డాయి. రష్యా, ఇరాన్‌ల నుంచి విద్యుత్, గ్యాస్ సరఫరాలు నిలిచిపోవడంతో ఇంధన ధరలు విపరీతంగా పెరిగి, ఐరోపా వ్యాపారులూ గృహ యజమానులకు నిర్వహణ ఖర్చులు భారంగా మారాయి. 2021–26 మధ్య ఆహారం, పానీయాల ధరలు ఏకంగా 34శాతం పెరిగాయి. గత పదేళ్లలోనే ఐరోపా దేశాల్లో ఇంటి ధరలు 50శాతానికి పైగా అధికమయ్యాయి. దాంతో పట్టణాల్లో ఇళ్లు అందుబాటులో లేకపోవడంతో ఫ్రాన్స్, ఇటలీ, పోర్చుగల్ వంటి దేశాల్లో పెద్దయెత్తున నిరసనలు వ్యక్తమయ్యాయి. చైనా నుంచి దిగుమతయ్యే సోలార్ ప్యానెళ్లు, ఈవీలు, ఎలక్ట్రానిక్ వస్తువులు చౌక ధరలకే లభిస్తున్నాయి కానీ, వీటివల్ల ఐరోపా ఫ్యాక్టరీలు దెబ్బతినిపోతున్నాయి. నిజానికి అమెరికా సుంకాల వల్ల చైనా తన మిగులు ఉత్పత్తిని ఐరోపావైపు మళ్లిస్తోంది. దీంతో ఈయూ వ్యాప్తంగా మూడు లక్షల ఫ్యాక్టరీ ఉద్యోగాలు పోయే ప్రమాదముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీనికితోడు ఏఐ కారణంగా ఎంట్రీ లెవెల్ ఉద్యోగాలు అదృశ్యమవడంతో చదువు పూర్తిచేసుకునే విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. ఇది అల్లర్లకు దారితీయవచ్చని సర్వేలు హెచ్చరించాయి. ఇప్పటికే పలు ఐరోపా బ్యాంకులు ఉద్యోగాల కోతకు ఉపక్రమించాయి. ఆ క్రమంలోనే మొన్నామధ్య పోలండ్‌లో 'ఉద్యోగాలను కాపాడండి' అంటూ నిరసన ప్రదర్శనలు జరిగాయి.ఐరోపా సమాఖ్య ప్రభుత్వాలు విద్య, వైద్యం, గృహవసతి, సామాజిక సంక్షేమం వంటి రంగాలకు కేటాయింపులు తగ్గించి... ఉక్రెయిన్‌కు ఆయుధ సరఫరా, రష్యాతో యుద్ధానికి నిధులు మళ్లిస్తున్నాయని యువతరం ఆగ్రహిస్తోంది. రష్యన్ వర్గాలు ఈ అసంతృప్తిని సామాజిక మాధ్యమాల ద్వారా మరింత ఎగదోస్తున్నాయి. 'ప్రభుత్వాల యుద్ధాల కోసం కాదు, మన భవిష్యత్తు కోసం పోరాడదాం' అంటూ నవంబరు 20న ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్, స్పెయిన్, ఇటలీ సహా పలు దేశాల్లో విద్యార్థి సంఘాలు ఉద్యమించనున్నాయి. ఇటలీలో సీజీఐఎల్ కార్మిక సంఘం సైతం సార్వత్రిక సమ్మెకు పిలుపిచ్చింది. కాబట్టి, ఆయా ప్రభుత్వాలు ఉద్యమాలను అణచివేయడానికి బదులు... యువతరం భవిష్యత్తు, ఆర్థిక భద్రతకు భరోసా కల్పించే విధాన నిర్ణయాలను ప్రకటించాల్సి ఉంది.

ఆర్థిక వ్యూహాన్ని మార్చుకోవాలి

చైనా నుంచి పోటీని తట్టుకుని ఫ్యాక్టరీ ఉద్యోగాలను కాపాడుకోవాలని ఈయూ గట్టిగా ప్రయత్నిస్తోంది. చైనాతో ఈయూ దేశాల వాణిజ్యలోటు 2025 నాటికే 36వేల కోట్ల డాలర్లకు చేరింది. ఇప్పటికే చైనీస్ ఈవీల దిగుమతిపై అదనపు సుంకాలు విధించిన ఈయూ... రసాయనాలు, యంత్రాలు, ఫర్నిచర్ దిగుమతులపైనా అదనపు చర్యలు చేపట్టాలని యోచిస్తోంది. డ్రాగన్ మార్కెట్ మాయాజాలాన్ని అడ్డుకోవడానికి అమెరికాలోని 'సెక్షన్–301' తరహాలో కొత్త వాణిజ్య ఆయుధాన్ని తీసుకువచ్చేందుకు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మెక్రాన్, జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడ్రిక్ మెర్జ్‌ల నేతృత్వంలో చర్చలు జరుగుతున్నాయి. ఈయూ కఠిన ఆంక్షలు విధిస్తే, చైనా ప్రతీకార వాణిజ్య యుద్ధానికి దిగి అరుదైన లోహాల ఎగుమతిని నిలిపేయవచ్చు. అప్పుడు పరిస్థితి ఇంకా సంక్లిష్టమవుతుంది. డిజిటల్ విప్లవం, ఏఐ పోటీలో ఆంధ్రోపిక్, ఓపెన్ ఏఐ, గూగుల్, మెటా వంటి అమెరికన్ కంపెనీల విస్తరణ వేగం ముందు ఐరోపా బాగా వెనకబడిపోయింది. ఇటువంటి పరిస్థితుల్లో చైనా ఉత్పాదక శక్తి, అమెరికా సాంకేతిక నైపుణ్యం మధ్య నలిగిపోకుండా ఈయూ తన ఆర్థిక వ్యూహాన్ని శరవేగంగా మార్చుకోవాలి. అప్పుడే ఐరోపా తన యువతరం భవిష్యత్తుకు భరోసా కల్పించగలుగుతుంది.

దిగొస్తున్న కూరగాయల ధరలు



హైదరాబాద్, తెలుగు రాష్ట్రాల్లో కూరగాయల ధరలు దిగొస్తున్నాయి. వంటిల్లో రోజూ ఉపయోగించే టమాటా, ఉల్లిపాయలు ధరలు అదుపులో ఉన్నాయి. మొన్నటివరకు వీటి ధరలు భగ్గుమనగా.. ప్రస్తుతం స్థిరంగా కొనసాగుతున్నాయి. దీపావళి పండుగ సీజన్ క్రమంలో ధరలు చౌకకే దొరకడంతో సామాన్యులు ఊరట చెందుతున్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఇటీవల ధరలు పెరిగాయి. కూరగాయలకు డిమాండ్ ఉండటంతో ధరలు పెరిగాయి. అయితే ఇప్పుడు పంట మార్కెట్‌కు వస్తుండటంతో సరఫరా పెరిగింది. ఈ కారణంతో ధరలు తగ్గుతూ వస్తున్నాయి. దీంతో ఈ పరిణామం పండుగ వేళ సామాన్యుల ఇంటి బడ్జెట్‌ను తగ్గిస్తోంది. పండుగ సమయాల్లో ఇంట్లో ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. కిరాణా సరుకుల అవసరం ఎక్కువగా ఉంటుంది. ఇక రకరకాల వంటలు వడేందుకు కూరగాయల అవసరం ఎక్కువగా ఉంటుంది. ధరలు తగ్గడం పండక్కి ముందే ఊరటగా కల్గిస్తోంది.కూకట్‌పల్లి మోడ్రన్ అండ్ మోడల్ రైతు బజార్‌లోని నవంబర్ 3వ తేదీన కిలో టమాట రూ. 29, వంకాయ రూ. 18, బెండకాయ రూ. 45, పచ్చిమిర్చి రూ. 45, బజ్జి మిర్చి రూ. 60, కాకరకాయ రూ. 35, బీరకాయ రూ. 35, క్యాబేజీ రూ. 13, బీన్స్ రూ. 55, క్యారెట్ రూ. 43, గోబీపువ్వు రూ. 25, దొండకాయ రూ. 23, చిక్కుడుకాయ రూ. 45, గోరుచిక్కుడు రూ. 35, బీట్‌రూట్ రూ. 19కు విక్రయిస్తున్నారు. ఇఖ క్యాప్సికమ్ రూ. 45, బంగాళాదుంప రూ. 19, కీర (లోకల్) రూ. 23, కీర (ఇటాలియన్) రూ. 35, దోసకాయ రూ. 18, సొరకాయ రూ. 20, పొట్లకాయ రూ. 22 పలుకుతున్నాయి. అలాగే కిలో కంద రూ. 35, ఉల్లికాడలు రూ. 55, ఉల్లిగడ్డ రూ. 40, పచ్చి మామిడికాయ ఒక్కొక్కటి రూ. 15–20, అరటికాయ ఒక్కొక్కటి రూ. 9–10, చామగడ్డ రూ. 35, ముల్లంగి ఒక్కొక్కటి రూ. 6–8, చిలగడదుంప రూ. 35, గుమ్మడికాయ రూ. 25, నిమ్మకాయలు డజను రూ. 50–60కు లభిస్తున్నాయి. అలాగే మునగకాయలు ఒక్కొక్కటి రూ. 8–10, బొప్పాయి రూ. 50, పుట్టగొడుగులు (200 గ్రా.) రూ. 50, ఎండుమిర్చి రూ. 280, పాత అల్లం రూ. 180, కొత్త అల్లం రూ. 120, వెల్లుల్లి రూ. 260, చింతపండు రూ. 160, పండుమిర్చి రూ. 80, ఉసిరి రూ. 45, కరివేపాకు రూ. 80, పర్వల్ రూ. 28, పల్లికాయ రూ. 55, లోబియా రూ. 28, ఆగాకరకాయ కిలో రూ. 85గా ఉన్నాయి.విజయవాడలోని రైతు బజార్లలో కిలో టమాట రూ.39, బెండ రూ.24, పచ్చిమిర్చి రూ.34, కాకర రూ.34, క్యాబేజీ రూ.24, క్యారెట్ రూ.45, దొండ రూ.24, బంగాళదుంప రూ.25, ఉల్లిపాయలు రూ.39, గోరుచిక్కుళ్లు రూ.32, దోస రూ.20, చామదుంప రూ.34, అల్లం రూ.76, కంద రూ.34, బీట్ రూట్ రూ.36, కీరదోస రూ.46, బీన్స్ రూ.105, క్యాప్సికం రూ.60, చింతకాయలు రూ.100 పలుకుతున్నాయి

దానం నాగేందర్ వర్సెస్ పి. విజయారెడ్డి న్యాయపోరాటంలో గెలుపెవరిది?



హైదరాబాద్,ఓవైపు పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద ఎమ్మెల్యే పదవిని కోల్పోయిన దానం నాగేందర్ మరోవైపు ఆయన 2023 లో ఎమ్మెల్యే గా గెలిచిన ఎన్నికే చెల్లదంటూ న్యాయ పోరాటం చేస్తున్న కాంగ్రెస్ నాయకురాలు పి విజయారెడ్డి. ఇంకోవైపు ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా దానం నాగేందర్ పేరును ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి. ఒకే నియోజక వర్గం ఒకే నాయకుడు కానీ రెండు వేరు వేరు న్యాయ పోరాటాలు ఇప్పుడు ఖైరతాబాద్ రాజకీయాల్లో ఇదే హాట్ టాపిక్. అసలు దానం నాగేందర్ ఎమ్మెల్యే పదవిని ఎందుకు కోల్పోయారు? హైకోర్టు తీర్పును సుప్రీం కోర్టు సమర్థించిన తర్వాత ఖైరతాబాద్లో ఉప ఎన్నిక అనివార్యమైందా? 2023 ఎన్నికల్లో దానం అఫిడవిట్లో తప్పుడు సమాచారం ఇచ్చారంటూ విజయారెడ్డి వేసిన పిటిషన్ లో ఏముంది? ఆ కేసులో ఆమెకు అనుకూలంగా తీర్పు వస్తే ఏం జరుగుతుంది? మరోవైపు దానాన్నే మళ్ళీ అభ్యర్థిగా ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ వ్యూహం ఏంటి? ఈ ప్రశ్నలన్నిటికీ సమాధానం తెలుసుకుందాం.

దానం నాగేందర్ పదవికి ఎసరు ఎక్కడ వచ్చింది..?

దానం నాగేందర్ ఎమ్మెల్యే పదవికి అసలు ఎసరు ఎక్కడ వచ్చింది అంటే ముందుగా 2023 అసెంబ్లీ ఎన్నికల దగ్గరికి వెళ్దాం. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నియోజక వర్గంలో బిఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన దానం నాగేందర్ విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన పి విజయారెడ్డి ఓటమి చెందారు. దాదాపు 22వ000 ఓట్ల మెజారిటీతో దానం నాగేందర్ ఎమ్మెల్యే గా ఎన్నికయ్యారు. కానీ ఎన్నికైన కొద్ది నెలలకే రాజకీయ సమీకరణాలు మారిపోయాయి. 2024 మార్చి 17వ తేదీన దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. అప్పటికే బిఆర్ఎస్ ఎమ్మెల్యే గా ఉన్న ఆయన తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయలేదు. అంతేకాదు 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ ఎంపి స్థానానికి పోటీ చేశారు. ఇక్కడే అసలు వివాదం మొదలైంది. ఒక పార్టీ బి ఫామ్ పై ఎమ్మెల్యే గా గెలిచి ఆ పార్టీకి రాజీనామా చేయకుండా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండా మరో పార్టీ బి ఫామ్ పై ఎంపీ గా పోటీ చేయడం. ఇదంతా కూడా పార్టీ ఫిరాయింపుల నిరోధ చట్టం పరిధిలోకి వస్తుందా లేదా అన్నది న్యాయస్థానాల ముందుకు వెళ్ళింది. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ దానం అనర్హత పిటిషన్ను తిరస్కరించడంతో బిజెపి ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి బిఆర్ఎస్
ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు.

ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా హైకోర్టు కీలక తీర్పు..

2026 సెప్టెంబర్ 18న తెలంగాణ హైకోర్టు కీలక తీర్పిచ్చింది. స్పీకర్ నిర్ణయాన్ని పక్కన పెట్టి దానం నాగేందర్ను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించింది. 2024 ఏప్రిల్ 23 నుంచి అనర్హత అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది కోర్టు. దానం సుప్రీం కోర్టును ఆశ్రయించిన అక్కడ కూడా ఊరట దక్కలేదు. 2026 సెప్టెంబర్ 24వ తేదీన సుప్రీం కోర్టు ఆయన పిటిషన్ను కొట్టేసింది. దీంతో ఖైరతాబాద్ ఎమ్మెల్య స్థానం ఖాళీ అయినట్లు 2అసెంబ్లీ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. సెప్టెంబర్ 26వ తేదీన గెజిట్ లో ఈ విషయం ప్రచురితమైంది. అంటే దానం నాగేందర్ ప్రజా ప్రాతినిధ్యం చట్టం కింద ఎమ్మెల్యే పదవి కోల్పోవడంతో ఖైరతాబాద్ లో ఉప ఎన్నికకు మార్గం ఏర్పడింది. కానీ కథ ఇక్కడితో ముగియలేదు. ఇక్కడే విజయారెడ్డి ఎంటర్ అయ్యారు.

అసలు విజయారెడ్డి పిటిషన్ లో ఏముంది.?

అసలు విజయారెడ్డి పిటిషన్ లో ఏముంది అంటే ఖైరతాబాద్ ఉప ఎన్నిక కథలో అసలైన ట్విస్ట్ అంతా కూడా ఇక్కడే ఉంది. 2023 ఎన్నికల్లో దానం నాగేందర్ చేతిలో ఓటమి చెందిన కాంగ్రెస్ నాయకురాలు పి విజయారెడ్డి ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత 2024 జనవరిలోనే తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఏమని అంటే దానం నాగేంద ఎన్నికల సమయంలో సమర్పించిన అఫిడవిట్ లో తన భార్య తనపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులకు సంబంధించిన ఆస్తుల వివరాలను పూర్తిగా వెల్లడించలేదనేది ఆమె ప్రధాన ఆరోపణ అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ చేసేటప్పుడు తమ ఆస్తులు అప్పులు ఆదాయ వనరులు కుటుంబ సభ్యులకు సంబంధించిన ఆస్తులు ఆ వివరాలన్నిటిని కూడా అఫిడవిట్లో వెల్లడించాలి. ఇది కేవలం ఒక ఫార్మాలిటీ కాదు ఓటరు తనకు ఓటు వేయబోతున్న అభ్యర్థి ఆర్థిక నేపథ్యాన్ని తెలుసుకునేందుకు రాజ్యాంగబద్ధమైన సమాచార హక్కులో భాగం.

హైకోర్టును ఆశ్రయించిన విజయారెడ్డి..

అయితే దానం నాగేందర్ అఫిడవిట్లో తప్పుడు సమాచారం ఇచ్చారన్నది విజయ రెడ్డి చేసిన ప్రధాన ఆరోపణ మాత్రమే. అది ఇంకా న్యాయస్థానంలో నిరూపితం కావలసి ఉంది. ఈ ఆరోపణల ఆధారంగా దానం నాగేందర్ ఎన్నిక చెల్లనిదిగా ప్రకటించి తనను ఎన్నికైన అభ్యర్థిగా గుర్తించాలని విజయారెడ్డి హైకోర్టును కోరారు. ఇక్కడ ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 లోని సెక్షన్ 100, సెక్షన్ 98, సెక్షన్ 101 కీలకంగా మారుతున్నాయి. సెక్షన్ 100 ప్రకారం ఎన్నికను చెల్లనిదిగా ప్రకటించడానికి చట్టంలో నిర్దేశించిన కారణాలు ఉండాలి. సెక్షన్ 101 ప్రకారం కొన్ని నిర్దిష్ట పరిస్థితుల్లో రెండవ స్థానంలో ఉన్న అభ్యర్థిని కూడా విజేతగా ప్రకటించే అవకాశం ఉంటుంది. అంటే విజయారెడ్డి పిటిషన్ లో రెండు అభ్యర్థనలు ఉన్నాయి. ఒకటి దానం ఎన్నికను రద్దు చేయడం. రెండవది తనను విజేతగా ప్రకటించడం. మరి ఈ రెండు ఒకటేనా అంటే కాదు. కేవలం దానం ఎన్నిక చెల్లదని ప్రకటించినంత మాత్రాన విజయారెడ్డికి ఎమ్మెల్యే పదవి వచ్చేయదు. ఆమెను విజేతగా ప్రకటించడానికి కూడా చట్టపరమైన ప్రమాణాలు నెరవేరాలి. అంటే మరి ఈ ఉప ఎన్నికకు ఎన్నికల సంఘమే బ్రేక్ వేసిందా అంటే న్యాయపరమైన చిక్కుల వల్ల వచ్చిన పరిస్థితి ఇది అనేది సుస్పష్టం.

ఉప ఎన్నికలు ఎలా నిర్వహిస్తారు..? విజయారెడ్డి

దానం నాగేందర్ అనర్హతతో ఖైరతాబాద్ స్థానం అయితే ఖాళీ అయింది. దీంతో ఉప ఎన్నిక నిర్వహించేందుకు ఎన్నికల సంఘం సిద్ధమవుతుందని అంతా భావించారు. కానీ విజయారెడ్డి మరోసారి కోర్టును ఆశ్రయించారు. తన 2023 ఎన్నికల పిటిషన్ ఇంకా పెండింగ్ లో ఉండగా ఖైరతాబాద్ ను ఖాళీస్థానంగా పరిగణించి ఉప ఎన్నిక ఎలా నిర్వహిస్తారు.. ఇదెలా సాధ్యమని ప్రశ్నించారు. అక్టోబర్ ఒకటవ తేదీన ఈ అంశంపై విచారణ సందర్భంగా ఎన్నికల సంఘం హైకోర్టుకు కీలక హామీ ఇచ్చింది. విజయారెడ్డి ఎన్నికల పిటిషన్ తుది పరిష్కారం అయ్యేవరకు ఖైరతాబాద్ ఉప ఎన్నికకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేయబోమని తెలిపింది. దీనిపై అక్టోబర్ 6న అఫిడవిట్ దాఖలు చేయాలని హైకోర్టు కూడా ఆదేశించింది. అక్టోబర్ఆరవ తేదీన ఎన్నికల సంఘం తన అఫిడవిట్ కూడా దాఖలు చేసింది. అంటే ఇప్పుడు ఖైరతాబాద్ ఉప ఎన్నికకు సంబంధించి ఎన్నికల సంఘం ముందుకు వెళ్ళడం లేదు అన్నమాట.

దానంకు కాంగ్రెస్ పార్టీ మళ్లీ అవకాశం ఇస్తుందా..?

ముందుగా 2023 ఎన్నికల పిటిషన్ పై హైకోర్టు నిర్ణయం వచ్చిన తర్వాతే ఆ ప్రాసెస్ జరుగుతుంది. మరి ఇక్కడే ఇంకొక ఆసక్తికరమైన అంశం ఉంది. దీన్ని బట్టి మనక ఏమ అర్థంవుతుంది అంటే దానం నాగేందర్ అనర్హతతో ఖైరతాబాద్ స్థానం ఖాళీ అయినప్పటికీ విజయారెడ్డి ఎన్నికల పిటిషన్ పెండింగ్ లో ఉండడం వల్ల ఆ స్థానాన్ని వెంటనే ఉపఎన్నికకు తీసుకెళ్లే పరిస్థితి లేదని కానీ ఇంతటి న్యాయపరమైన పరిణామాలు జరుగుతున్న సమయంలో కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా మరో నిర్ణయం తీసుకుంది. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి ఎవరనే దానిపై చాలా కాలంగా చర్చ జరుగుతుంది. 2023 లో కాంగ్రెస్ తరపున పోటీ చేసిన విజయారెడ్డి పేరు కూడా సహజంగానే వినిపించింది. మరో వైపు దానం నాగేందర్ కు కాంగ్రెస్ పార్టీ మళ్లీ అవకాశం ఇస్తుందా అన్న ప్రశ్న ఇన్నాలు ఉత్పన్నమైంది.

దానంను ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన రేవంత్..

ఈ ఊహాగానాలకు అక్టోబర్ 30వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెరదించారు. దానం నాగేందర్ను మళ్లీ ఖైరతాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించారు రేవంత్ రెడ్డి. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన రేవంత్ ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా దానం నాగేందర్ను బరిలోకి దింపుతామని ప్రకటించారు. దీంతో కాంగ్రెస్ రాజకీయంగా దానం వెంటే నిలబడాలని నిర్ణయించుకున్నట్లు స్పష్టమైంది. కానీ ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతుంది. 2023లో కాంగ్రెస్ అభ్యర్థిగా దానం నాగేందర్ పై పోటీ చేసి ఓడిపోయిన విజయారెడ్డి ఇప్పుడు ఆ దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీలోకి రావడంతో అదే దానం నాగేందర్తో కాంగ్రెస్ పార్టీలో ఉండే 2023 లో దానం నాగేందర్ ఎన్నిక చెల్లదంటూ కోర్టులో పోరాడుతున్నారు. మరోవైపు కాంగ్రెస్ అధిష్టానం మాత్రం దానం నాగేందర్నే తమ అభ్యర్థిగా ప్రకటిస్తుంది. ఒకవేళ విజయారెడ్డి పిటిషన్ లో ఆమెకు అనుకూలంగా తీర్పు వస్తే కాంగ్రెస్ పార్టీ తన నిర్ణయాన్ని మార్చుకుంటుందా లేక దానం అభ్యర్థిత్వానికే కట్టుబడి ఉంటుందా? ఇవి ఇప్పుడు రాజకీయంగా ఆసక్తికరమైన ప్రశ్నలు.

ఖైరతాబాద్‌పై చట్టం చెప్పే తీర్పు ఏంటి?

అయితే ఓవరాల్ గా చూస్తే ఖైరతాబాద్ భవిష్యత్తును నిర్ణయించబోయే మూడు పరిణామాలు అయితే స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఒకటి విజయారెడ్డి వేసిన పిటిషన్ను హైకోర్టు కొట్టేస్తే దానం నాగేందర్ 2023 ఎన్నిక చెల్లుబాటుపై ఆమె చేసిన సవాల్కు న్యాయపరంగా ముగింపు లభిస్తుంది. ఆ తర్వాత ఖాళీ అయిన స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించేందుకు మార్గం ఏర్పడుతుంది. రెండు దానం ఎన్నికను హైకోర్టు చెల్లనిదిగా ప్రకటిస్తే 2023 ఎన్నికల ఫలితంపై కొత్త న్యాయపరమైన పరిణామం వస్తుంది. అయితే విజయారెడ్డిని విజేతగా ప్రకటించాలంటే సెక్షన్ 101 లోని శరతులను కూడా కోర్టు పరిశీలించాలి. మూడు విజయ రెడ్డిని విజేతగా ప్రకటిస్తే ఆమెకు ఎమ్మెల్యే గా కొనసాగే అవకాశం ఏర్పడుతుంది. అలాంటి సందర్భంలో ఖైరతాబాద్ ఉప ఎన్నిక అవసరం ఉండకపోవచ్చు. అయితే ఆ తీర్పు అపీల్ పరిస్థితి అసెంబ్లీ పదవి కాలం వంటి అంశాలను కూడా ప్రభావితం చేస్తుంది. ప్రస్తుతానికయితే విజయారెడ్డి ఎన్నికల పిటిషన్ పై తుది తీర్పు వెలువడలేదు.

జూనియర్ కేవ పాల్ చేతలు మానుకో..!

షాద్ నగర్ ,నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా నిరంతరం ప్రజల్లో ఉంటూ సేవలందిస్తున్న స్థానిక శాసనసభ్యుడిపై షాద్ నగర్ జూనియర్ కేవ పాల్ గా పేరు గాంచిన పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి నిరాధారమైన, చవకబారు ఆరోపణలు చేస్తే సహించేది లేదని గిరిజన ఆదివాసీ రాష్ట్ర కోఆర్డినేటర్ రఘు నాయక్ తీవ్రస్థాయిలో హెచ్చరించారు. షాద్‌నగర్ పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల స్థానిక నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి ఎమ్మెల్యేను ఉద్దేశించి చేసిన విమర్శలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్యేకు పనులు చేయడం చేతకాదని, పరిపాలనపై అవగాహన లేదంటూ మాట్లాడటం విష్ణువర్ధన్ రెడ్డి అజ్ఞానానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధిని ప్రశ్నించే హక్కు ఎవరికైనా ఉంటుందని, అయితే అభివృద్ధిని విస్మరించి వ్యక్తిగత విమర్శలు, బెదిరింపు ధోరణికి దిగితే ఇక్కడ భయపడేవారు ఎవరూ లేరని స్పష్టం చేశారు.అభివృద్ధి పనుల ప్రగతిని చూడండిఎమ్మెల్యే ఆధ్వర్యంలో నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో నిధులు మంజూరై అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని రఘు నాయక్ పేర్కొన్నారు. ప్రజల రాకపోకలు, దర్గా మార్గ ప్రయాణికుల సౌకర్యార్థం వై-జంక్షన్ విస్తరణ, ఆర్ అండ్ బి రహదారి పనుల కోసం పార్టీలకు అతీతంగా కేంద్ర, రాష్ట్ర అధికారులతో ఎమ్మెల్యే స్వయంగా మాట్లాడి మంజూరు చేయించారని వెల్లడించారు.విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ జూనియర్ కళాశాల ఆధునికీకరణ కోసం దాదాపు రూ.15 కోట్లు సమీకరించడం జరిగిందన్నారు. కొందుర్గు ప్రాంతంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ప్రాజెక్టు కింద సుమారు రూ.250 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారని తెలిపారు. హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు స్వగ్రామంలో అత్యాధునిక 'తెలంగాణ పబ్లిక్ స్కూల్' ఏర్పాటుకు నిధులు సాధించిన ఘనత ఎమ్మెల్యేకే దక్కుతుందని స్పష్టం చేశారు. 'కామ్రేడ్' పదం వాడే అర్హత నీకు ఉందా?'ఖబర్దార్ కామ్రేడ్' అంటూ పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి హెచ్చరికలు జారీ చేయడాన్ని రఘు నాయక్ ఎద్దేవా చేశారు. "కామ్రేడ్ అంటే సహచరుడు, ప్రజా ఉద్యమాల్లో కలిసి నడిచే తోటి సోదరుడు అని అర్థం. జాతి నిర్మాత జవహర్‌లాల్ నెహ్రూ సైతం ఆ పదాన్ని గౌరవప్రదంగా ఉపయోగించారు. మతం, కులం పేరిట ప్రజల మధ్య చిచ్చుపెట్టే సిద్ధాంతాలు కలిగిన బిజెపి పార్టీలో ఉండే నాయకులకు 'కామ్రేడ్' పదాన్ని పలికే నైతిక హక్కు లేదు" అని ఘాటుగా బదులిచ్చారు. నిజంగా నియోజకవర్గ ప్రజల క్షేమం కోరే వారైతే ప్రజాసమస్యలపై నిర్మాణాత్మకమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని, వాటిని ప్రభుత్వం చిత్తశుద్ధితో స్వీకరిస్తుందని తెలిపారు. అలా కాకుండా మీడియా ముందు మైలేజ్ కోసం అవాకులు చవాకులు పేలితే రాజకీయంగా గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఏ కాంగ్రెస్ పార్టీని అయితే పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి తిడుతున్నాడో అదే పార్టీ నుండి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గా ఎంపికైన విషయాన్ని మరువద్దని సూచించారు. నువ్వు చేసే పిచ్చి పనులకు ఇక్కడ ప్రజలు జూనియర్ కేవ పాల్ అని మీపై ప్రచారం చేస్తున్నారని ఇది గమనించుకొని మసలుకోవాలని పేర్కొన్నారు. గతంలో మాజీ మున్సిపల్ చైర్మన్ నరేందర్ అనుచరుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డిని చెంపదెబ్బ కొట్టిన అంశాన్ని సైతం ఆయన ప్రస్తావించారు. ఈ పాత్రికేయుల సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు చంది తిరుపతి రెడ్డి, మహబూబ్, రమేష్, చంద్రశేఖర్ గౌడ్, చందం నరసింహులు, జంగయ్య, డిప్యూటీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ముక్కు పోగులు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల చిన్నారి ఘటనలో ట్విస్ట్..

జగిత్యాల,'అమ్మా.. నన్ను తీసుకెళ్లు.. భయమేస్తోంది' అంటూ శిశు సంక్షేమ కేంద్రంలో చిన్నారి రోదించిన వీడియోతో రాష్

మరోసారి కోలుకోలేని దెబ్బ
వైఎస్సార్‌సీపీ



విజయవాడ, ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల ఫలితాల సరళి వైఎస్సార్‌సీపీకి మరోసారి కోలుకోలేని దెబ్బకొడుతోంది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో తెలుగుదేశం–జనసేన–బీజేపీ కూటమి హవా స్పష్టంగా కనిపిస్తుంటే, వైఎస్సార్‌సీపీ మాత్రం ఎక్కడో ఒకట్రెండు వార్డులు లేదా స్వల్ప ఓట్ల ఆధిక్యం దక్కినా దాన్నే ఏదో మెగా విజయంలా ప్రచారం చేసుకుంటోంది.అసలు తమకు ప్రజలు ఓట్లేయరని, కూటమి వేవ్‌లో తాము కొట్టుకుపోవడం ఖాయమని ఆ పార్టీ నాయకత్వానికి ముందే గట్టి నమ్మకం కుదిరినట్లుంది. అందుకే, ఆశించిన స్థాయి కంటే ఘోర పరాజయం ఎదురవుతున్నా, ఎక్కడో ఒకచోట లభించిన చిన్నిపాటి లీడ్‌ను పట్టుకుని ఓదార్పు వెతుక్కునే పనిలో పడ్డారు.సాక్షి మీడియా నెట్‌వర్క్‌తో పాటు సదరు పార్టీ సోషల్ మీడియా సైన్యం ప్రదర్శిస్తున్న వైఖరి ప్రజాస్వామ్యానికి నవ్వులాటగా మారింది. కూటమి అభ్యర్థులు వందలాది వార్డులలో, పోస్టల్ బ్యాలెట్లలో భారీ మెజారిటీతో దూసుకుపోతుంటే.. వాటిని కప్పిపుచ్చి, వైఎస్సార్‌సీపీకి అత్యంత అరుదుగా అధిక్యం వచ్చిన వార్డుల గణాంకాలను మాత్రమే హైలైట్ చేస్తూ స్క్రీన్లు నింపేస్తున్నారు. ఎక్కడో ఒక రౌండ్‌లో తాత్కాలికంగా ముందంజలోకి రాగానే, ఆ ప్యాచ్‌లను కట్ చేసి సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ ఏదో జగజ్జేతల్లా సంబరాలు చేసుకోవడం వారి ఆత్మవంచనకు, అంధకార ప్రతిపక్ష రాజకీయాలకు అద్దం పడుతోందిఅత్యంత విచిత్రమైన అంశమేమిటంటే.. అసలు పోలింగ్ రోజే మున్సిపల్ ఎన్నికలు అక్రమంగా జరిగాయని, తమ ఏజెంట్లను తరిమేశారని, ప్రజాస్వామ్యం ఖూనీ అయిపోయిందని విపరీతంగా రచ్చ చేశారు. ఆఖరికి పులివెందుల మున్సిపాలిటీలో వైఎస్ జగన్ రెడ్డి తన సొంత ఓటును కూడా వేయకుండా బహిష్కరించి, రీపోలింగ్ కావాలంటూ ధర్నాలు చేశారు. కానీ కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమై, అదే ఎన్నికల్లో పొరపాటున ఎక్కడైనా ఒకటి రెండు వార్డుల్లో వైఎస్సార్‌సీపీకి లీడ్ లేదా విజయం దక్కగానే క్షణాల్లో మాట మార్చేస్తున్నారు. అక్రమాలు జరిగాయన్న నోళ్లతోనే ఇప్పుడు ఆ ఓట్లను ప్రజాదరణ గా ప్రచారం చేసుకుంటూ ద్వంద్వ నీతిని చాటుకుంటున్నారు.దాదాపు అన్ని పట్టణ ప్రాంతాల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నుంచే కూటమి స్పష్టమైన ఆధిక్యాన్ని కనబరుస్తూ విజయకేతనం ఎగురవేస్తోంది. వాస్తవాన్ని ఒప్పుకునే ధైర్యం లేక, ప్రజా తీర్పును గౌరవించే మానసిక పరిపక్వత లేక వైఎస్సార్‌సీపీ ఇలాంటి మైండ్ గేమ్స్‌కు తెరలేపుతోంది. ఎన్నికలు సరిగ్గా జరగలేదని ఒకవైపు విమర్శిస్తూనే, మరోవైపు వచ్చిన కొద్దిపాటి ఫలితాలకే భుజాలు తడుముకోవడం ఆ పార్టీ పతనానికి నిదర్శనం. ప్రజలు పూర్తిగా తిరస్కరించినా, సాక్షి రాతలతోనూ, పేక్ సోషల్ మీడియా పోస్టులతోనూ కాలాన్ని వెళ్లదీయవచ్చనే భ్రమల్లో వైఎస్సార్‌సీపీ బతుకుతోందని ఈ ఎన్నికల కౌంటింగ్ దృశ్యాలు స్పష్టం చేస్తున్నాయి.

దుమ్ములేపిన రెబల్స్...

విజయవాడ, ఏపీ మున్సిపల్ ఎన్నికల్లో పలు చోట్ల రెబల్ అభ్యర్థులు ట్విస్ట్ ఇచ్చారు. టికెట్ దక్కలేదని వెనక్కి తగ్గకుండా.. స్వతంత్రులుగా బరిలోకి దిగి ప్రధాన పార్టీల అభ్యర్థులకు షాక్ ఇచ్చారు. ఆదోనిలో జనసేన రెబల్ ఏకంగా చైర్‌పర్సన్ స్థానాన్నే దక్కించుకోవడం హాట్ టాపిక్‌గా మారింది. ఏపీ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో రెబల్ అభ్యర్థులు ఊహించని విధంగా సత్తా చాటారు. పార్టీల టికెట్లు దక్కకపోయినా.. స్వతంత్రులుగా బరిలోకి దిగి ఓటర్ల మద్దతుతో విజయం సాధించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం మున్సిపాలిటీలో జనసేన ఛైర్మన్ పీఠాన్ని దక్కించుకుంది. మొత్తం 36 వార్డులున్న పిఠాపురంలో ఏకంగా పది వార్డుల్లో స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు. దీంతో రెబల్స్ గెలుపు స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా ఆదోని మున్సిపల్ ఎన్నికల్లో జనసేన రెబల్ అభ్యర్థి గెలిచి ఈ ఎన్నికల్లో చరిత్ర సృష్టించారు.ఇక కర్నూలు జిల్లా ఆదోని మున్సిపల్ ఎన్నికల్లో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. జనసేన రెబల్ అభ్యర్థిగా బరిలోకి దిగిన స్వప్న మల్లప్ప నాయకర్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి చైర్‌పర్సన్ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. కూటమి సీట్ల సర్దుబాటులో భాగంగా ఆదోని చైర్‌పర్సన్ స్థానం టీడీపీకి కేటాయించారు. నాగమణిని టీడీపీ అభ్యర్థిగా ఖరారు చేశారు. దీంతో జనసేన ఆదోని ఇన్‌చార్జి మల్లప్ప నాయకర్ తన భార్య స్వప్నను స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దించారు. చివరకు ఆమె విజయం సాధించడంతో ఆదోని రాజకీయాల్లో ఈ ఎన్నిక ప్రత్యేకంగా నిలిచింది. స్వప్న భర్త మల్లప్ప నాయకర్ మాట్లాడుతూ.. స్వప్న గెలుపును పవన్ కళ్యాణ్‌కు బహుమతిగా ఇస్తున్నామని పేర్కొన్నారు. తాను ఎప్పటికీ పవన్ అభిమానిని అని.. ఆయనతోనే ఉంటానని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ తనకు అండగా ఉన్నారన్నారు..పిఠాపురం నియోజకవర్గంలోని గొల్లప్రోలులోనూ స్వతంత్ర అభ్యర్థులు పార్టీలకు షాక్ ఇచ్చారు. నాలుగు వార్డుల్లో రెబల్ అభ్యర్థులు విజయం సాధించారు. ఇద్దరు జనసేన రెబల్స్, ఇద్దరు టీడీపీ రెబల్ అభ్యర్థులు బరిలో నిలిచి గెలిచారు. ఇక ఏలూరు మున్సిపల్ ఎన్నికల్లోనూ స్వతంత్ర అభ్యర్థులు ప్రభావం చూపించారు. దాదాపు ఎనిమిది మంది ఇండిపెండెంట్లు విజయం సాధించారు.మొత్తంగా ఏపీ మున్సిపల్ ఎన్నికల్లో రెబల్ అభ్యర్థుల గెలుపు ప్రధాన పార్టీలకు కొత్త రాజకీయ సమీకరణాలను తెరపైకి తెచ్చింది. పిఠాపురం, గొల్లప్రోలు, ఏలూరులో కార్పొరేటర్, కౌన్సిలర్ స్థాయిలో రెబల్స్ సత్తా చాటగా.. ఆదోనిలో ఏకంగా చైర్‌పర్సన్ స్థానాన్ని రెబల్‌గా బరిలోకి దిగిన అభ్యర్థి సొంతం చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

ఒంగోలులో భారీ దారి దోపిడీ..

ఒంగోలు : ఒంగోలులో బుధవారం ఉదయం భారీ దారి దోపిడీ జరిగింది. తమిళనాడులోని కోయంబత్తూరు నుంచి ఒంగోలులోని నగల దుకాణాలకు బంగారం తీసుకెళ్తున్న వ్యాపారులను కొందరు వ్యక్తులు మార్గమధ్యంలో అపహరించి దోపిడీకి పాల్పడ్డారు. ఒంగోలు రైల్వేస్టేషన్‌లో దిగి ఆటోలో వెళుతున్న వ్యాపారులను స్థానిక ఉపాస్ ఆస్పత్రి సమీపంలో కారును అడ్డుపెట్టి అటకాయించారు. వ్యాపారులను బలవంతంగా ఆటో నుంచి బయటికి లాగి తమ కారులో ఎక్కించుకొని దక్షిణ బైపాస్ సమీపంలోని డీ6 ఎక్సోటికా ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ వారిపై దాడి చేసి సుమారు 2 కేజీల బంగారు ఆభరణాలను దోచుకుని ఉడాయించారు. ప్రాణాలతో బయటపడిన వ్యాపారులు గాంధీరోడ్డుకు చేరుకొని దోపిడీ జరిగిన విషయాన్ని స్థానిక బంగారు వ్యాపారులకు

రూ.100 కోట్లకు పైగా మిల్లర్ల స్కామ్



హైదరాబాద్, ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని మర ఆడించి తిరిగి ప్రభుత్వానికి బియ్యం అప్పగించాల్సిన బాధ్యత వారిది. కానీ.. ఇక్కడే అసలు కథ మొదలవుతుంది. ప్రభుత్వానికి కేటాయించిన సన్నరకం వడ్లను తీసుకోవడం.. వాటి స్థానంలో దొడ్డు రకం బియ్యాన్ని అప్పగించడం.. ఈ క్రమంలో నాణ్యత, రకం, లెక్కల విషయంలో భారీ తేడాలకు పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వానికి అప్పగించాల్సిన బియ్యంలోనే రకాలు మార్చి కోట్ల రూపాయల మేర లబ్ధి పొందారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాను కేంద్రంగా చేసుకుని కొత్తగూడెం అసోసియేషన్‌లో కీలకంగా వ్యవహరిస్తున్న ఐదుగురు మిత్రులు కలిసి ఈ దందా సాగించినట్లు ప్రచారంలో ఉన్నది. ఇదే వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ దందా ద్వారా ప్రభుత్వానికి నష్టం తెచ్చి.. సుమారు రూ.100 కోట్ల మేర వెనకేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇంత పెద్ద మొత్తంలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు ఉన్నప్పటికీ సంబంధిత మిల్లుల్లో విజిలెన్స్ అధికారులు ఇప్పటివరకు సమగ్ర తనిఖీలు నిర్వహించకపోవడం పలు సందేహాలకు తావిస్తోంది. వీళ్లు ప్రధానంగా గ్రేడ్ ఏ సన్నరకం బదులు దొడ్డు రకం ప్రభుత్వానికి డెలివరీ చేశారన్న ఆరోపణలు ఉన్నాయి.

సన్నరకం తీసుకుని.. దొడ్డు రకం ఇచ్చి!

సన్న వడ్లకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో వాటిని కస్టమ్ మిల్లింగ్‌కు కేటాయించడం, తిరిగి నిర్దిష్ట ప్రమాణాల ప్రకారం బియ్యం అప్పగించడం కీలకం. అయితే.. కొందరు మిల్లర్లు ఈ విధానాన్నే తమకు అనుకూలంగా మార్చుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సన్నరకం వడ్లను తీసుకుని వాటి స్థానంలో దొడ్డు బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించినట్లు ఫిర్యాదులు ఉన్నాయి. వడ్ల రకం, దిగుబడి, బియ్యం నాణ్యత, అప్పగింతల లెక్కల్లో తేడాలు ఉన్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసలు ఏ రకం వడ్లు కేటాయించారు? ఎంత పరిమాణంలో తీసుకున్నారు? తిరిగి ఎంత బియ్యం అప్పగించారు? అప్పగించిన బియ్యం ఏ రకానికి చెందినది? అన్న అంశాలపై పూర్తిస్థాయి విచారణ జరిగితేనే అసలు వ్యవహారం బయటపడే అవకాశం ఉంది.రకాలు మార్చి బియ్యం అప్పగించినట్లయితే ప్రభుత్వానికి జరిగిన నష్టాన్ని ఎవరు భర్తీ చేస్తారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రధానంగా గ్రేడ్ ఏ రకానికి ఎంఎస్పీ రూ.2,389 ఉండగా.. కామన్ రకానికి రూ.2,369 ఉంది. అయితే.. కొత్తగూడెం పరిధిలో 70 మిల్లులో బియ్యం పెట్టారు. అయితే.. వారంతా కూడా గ్రేడ్ ఏ కింద దొడ్డు రకం బియ్యం అప్పగించడం గమనార్హం. ఇందులో అసోసియేషన్ బాధ్యుడైన బడా మిల్లర్ 54 ఏసీకేలకు పైనే పెట్టారు. 290 క్వింటాళ్లు అయితే ఒకే ఏసీకేగా పరిగణిస్తారు. కానీ, వీరు మాత్రం సన్న వడ్లను తీసుకొని దొడ్డు రకం ప్రభుత్వానికి అప్పగించారన్న ప్రచారం జరుగుతున్నది. దీని ద్వారా సుమారుగా రూ.100 కోట్లకు పైగా ఫ్రాండింగ్‌కు పాల్పడినట్లు సమాచారం. ప్రభుత్వం బోనస్ ఇవ్వని ధాన్యాన్ని వీరు అందించారు.

ఐదుగురు మిత్రులు.. రూ.100 కోట్ల దందా?

ఈ వ్యవహారంలో ఒకరిద్దరు మిల్లర్లే కాకుండా భద్రాద్రి కొత్త గూడేనికి చెందిన రైస్ మిల్లర్స్ అసోసియేషన్ బాధ్యుడితో కలిసి మరో నలుగురు ఈ వ్యవహారాన్ని నడిపినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మొదలైన ఈ వ్యవహారం క్రమంగా ఇతర జిల్లాలకు విస్తరించినట్లు సమాచారం. మిల్లుల మధ్య పరస్పర సహకారం, ధాన్యం కేటాయింపులు, బియ్యం అప్పగింతలు, లెక్కల నిర్వహణ వంటి అంశాల్లో సమన్వయంతో ముందుకెళ్లినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలోనే సుమారు రూ.100 కోట్ల మేర ఆర్థిక లబ్ధి పొందినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ఐదుగురి మిల్లుల లావాదేవీలను ఒకేసారి పరిశీలిస్తేనే వ్యవహారం పూర్తిస్థాయిలో వెలుగులోకి వచ్చే అవకాశమున్నదనే వాదనలు వినిపిస్తున్నాయి.

విజిలెన్స్ ఎందుకు స్పందించదు?

ఇంత పెద్ద మొత్తంలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వస్తున్న సంబంధిత మిల్లులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ ప్రత్యేక దృష్టి సారించకపోవడం చర్చనీయాంశంగా మారింది. అక్కడక్కడ జిల్లా స్థాయి అధికారులు తనిఖీలు నిర్వహించడం మినహా లోతైన విచారణ చేపట్టిన దాఖలాలు కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. తనిఖీలు నిర్వహించినా పూర్తి వివరాలు బయటకు వస్తున్నాయా? స్టాక్ రిజిస్టర్లు, ధాన్యం కొనుగోలు వివరాలు, కస్టమ్ మిల్లింగ్ రికార్డులు, బియ్యం అప్పగింతల లెక్కలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కేవలం పై పై తనిఖీలతో సరి పెడితే అనలు అక్రమాల గుట్టు ఎలా రట్టవుతుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.మిల్లుల్లో జరిగిన లావాదేవీలకు సంబంధించిన కీలక రికార్డులు, స్టాక్ వివరాలు, ధాన్యం కేటాయింపులు, బియ్యం అప్పగింతల లెక్కలు పరిశీలిస్తే వాస్తవాలు బయటపడే అవకాశం ఉంది. కానీ.. ఆ దిశగా సమగ్ర విచారణ ఎందుకు జరగడం లేదన్నది అంతుచిక్కడం లేదు. అధికారుల తనిఖీలు నామమాత్రంగా మారుతున్నాయా? మిల్లర్లకు ముందస్తు సమాచారం అందుతోందా? తనిఖీల్లో గుర్తించిన లోటుపాట్లపై చర్యలు తీసుకోకుండా వదిలేస్తున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు మిల్లర్లు, అధికారుల మధ్య లోపాయికారీ అవగాహన ఉందనే ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. వీరి ఐదుగురి మిల్లుల్లో ఇంతవరకు స్టేట్ టీం తనిఖీలు చేయకపోవడమూ విమర్శలకు తావిస్తోంది.

రాష్ట్రవ్యాప్తంగా విస్తరించిన దందా

ఉమ్మడి ఖమ్మం జిల్లా కేంద్రంగా సాగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ వ్యవహారం కేవలం ఒక జిల్లాకే పరిమితం కాలేదనే ప్రచారం జరుగుతోంది. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ వీరు ఈ దందా కొనసాగించినట్లు సమాచారం. మిల్లర్ల వారీగా ధాన్యం కేటాయింపులు, బియ్యం రకం, అప్పగింతల పరిమాణం, ప్రభుత్వానికి జరిగిన నష్టాన్ని పోల్చి చూస్తే అసలు లెక్క తేలే అవకాశం ఉంది. ముఖ్యంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ మిల్లర్లకు సంబంధించిన మిల్లుల్లో ఒకేసారి రాష్ట్రస్థాయి విజిలెన్స్ తనిఖీలు నిర్వహిస్తే అనేక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణకు ఆదేశిస్తారా? లేక ఈ వ్యవహారం కూడా కాగితాలకే పరిమితం అవుతుందా? అన్నది వేచి చూడాల్సిందే.

ములుగు కలెక్టరేట్‌కు బీటలు.. ప్రారంభమైన మూడు నెలలకే పగుళ్లు!

ములుగు : ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకే గొడుగు కిందకు తీసుకు వచ్చి ప్రజలకు మెరుగైన పాలన అందించాలనే లక్ష్యంతో నిర్మించిన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్) నిర్మాణ నాణ్యతపై ఇప్పుడు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అంగరంగ వైభవంగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించిన భవనం.. ప్రారంభమైన కొద్ది రోజులకే నిర్మాణ లోపాలను బయటపెడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ప్రతిష్టాత్మక భవనంలో స్లాబ్‌కు పగుళ్లు, గోడలకు తేమ, బీటలు కనిపిస్తుండటంతో నిర్మాణ సమయంలో నాణ్యత ప్రమాణాలు పాటించారా? లేక హడావుడిగా పనులు పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



కొద్ది రోజులకే బయటపడుతున్న లోపాలు...

ములుగు జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన సమీకృత కలెక్టరేట్ కార్యాలయాన్ని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి 2026 ఆగస్టు 16న ప్రారంభించారు. అట్టహాసంగా ప్రారంభోత్సవం జరిగి మూడు నెలల వ్యవధిలోనే భవనంలో నిర్మాణ సంబంధిత సమస్యలు కనిపిస్తున్నాయనే ఆరోపణలు రావడం గమనార్హం. ప్రారంభోత్సవ సమయంలో భవనం హంగులు, సౌకర్యాలు ఆకట్టుకున్నప్పటికీ.. ఇప్పుడు వెలుగు చూస్తున్న పగుళ్లు, తేమ సమస్యలు నిర్మాణ నాణ్యతపై చర్చకు దారితీస్తున్నాయి.

స్లాబ్‌పై పగుళ్లు.. గోడల్లోకి తేమ.....

రెండు అంతస్తులతో నిర్మించిన ఈ భవనంలోని రెండో అంతస్తు పైభాగంలో స్లాబ్‌కు పగుళ్లు ఏర్పడి బీటలు కనిపిస్తున్నట్లు సమాచారం. భవనం ప్రారంభానికి ముందే ఈ పగుళ్లను గుర్తించి కెమికల్ ట్రీట్‌మెంట్ ద్వారా పూడ్చి, అనంతరం పెయింటింగ్ చేసి సరిచేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ప్రారంభోత్సవం జరిగిన కొద్ది రోజులకే మళ్లీ కొత్తగా పగుళ్లు ఏర్పడటం చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా ఫ్లోర్ పైభాగంలోనూ పగుళ్లు కనిపించడం ఈ వాదనకు బలం చేకూర్ వస్తున్నాయి. ఇటీవల ఆదివారం కురిసిన చిరుజల్లులు అనంతరం భవనంలోని కొన్ని గోడల వెంట తేమ కనిపించడం నిర్మాణ నాణ్యతపై అనుమానాలను మరింత పెంచుతుంది. వర్షపు నీరు స్లాబ్ నుంచి లోపలికి ఇంకి గోడల్లోకి చేరటం, వాటర్‌ప్రూఫింగ్ పనులు సక్రమంగా నిర్వహించలేదా అని, నిర్మాణ సమయంలో కాంక్రీట్ పనుల్లో నాణ్యతా లోపాల వల్లే వర్షపు నీరు లోనికి వస్తుందని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

కోట్ల రూపాయలతో నిర్మాణం.. నాణ్యత ఏదీ....?

ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో నవతేజ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ సమీకృత కలెక్టరేట్ నిర్మాణ పనులు చేపట్టినట్లు సమాచారం. సుమారు రూ.53 కోట్లతో నిర్మించిన ఇంతటి భారీ భవనం ప్రారంభమైన కొద్ది కాలానికే పగుళ్లు, తేమ సమస్యలు ఎదుర్కొంటుండటం జిల్లా ప్రజల్లో అసంతృప్తికి కారణమవుతోంది. సాధారణంగా ప్రభుత్వ భవనాల నిర్మాణంలో కాంక్రీట్ నాణ్యత, స్టీల్ వినియోగం, క్యూరింగ్, వాటర్‌ప్రూఫింగ్, నిర్మాణ ప్రమాణాలను నిర్దేశిత పద్ధతిలో పాటించాల్సి ఉంటుంది. పనులు జరుగుతున్న సమయంలో సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయడంతోపాటు నాణ్యత పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. క్వాలిటీ కంట్రోల్ విభాగం సైతం నిర్మాణ పనులను తనిఖీ చేసి ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయో లేదో నిర్ధారించవలసి ఉంటుంది. మరి ఇన్ని వ్యవస్థలు ఉన్నప్పటికీ ఇలాంటి లోపాలు ఎలా చోటుచేసుకున్నాయన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

ప్రారంభానికి ముందే మరమ్మతులా...?

కలెక్టరేట్ భవనం ప్రారంభానికి ముందే స్లాబ్‌పై పగుళ్లు ఏర్పడగా వాటిని కెమికల్ ట్రీట్‌మెంట్‌తో పూడ్చి, పైకి పెయింటింగ్ చేసి సరి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అదే నిజమైతే నిర్మాణ లోపాలను అప్పట్లోనే గుర్తించిన అధికారులు వాటికి శాశ్వత పరిష్కారం చూపించారా? లేక ప్రారంభోత్సవం నాటికి భవనం అందంగా కనిపించాలనే ఉద్దేశంతో పైపైన మరమ్మతులు చేసి సరిపెట్టారా? అన్నది తేలాల్సి ఉంది. ఇప్పుడు మళ్లీ పగుళ్లు కనిపిస్తుండటం, గోడల్లో తేమ చేరడం చూస్తుంటే గతంలో చేసిన మరమ్మతుల నాణ్యతపై నా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేవలం పెయింటింగ్‌తో సమస్యను కప్పిపుచ్చడం కాకుండా అసలు లోపం ఎక్కడుందో గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాల్సిన బాధ్యత సంబంధిత శాఖపై ఉంది.

ఇతర ప్రతిష్టాత్మక నిర్మాణాలపై నా అనుమానాలు...!

ములుగు జిల్లాలో ఇదే నిర్మాణ సంస్థకు మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులతోపాటు రామప్పలో ప్రసాద్ పథకంలో భాగంగా నిర్మించిన ఆడిటోరియం వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులతో సంబంధం ఉన్నట్లు తెలుస్తోంది. ఒకవైపు కలెక్టరేట్ భవనంలో నిర్మాణ లోపాల ఆరోపణలు వెలుగులోకి వస్తుండగా, ఇదే సంస్థ చేపట్టిన ఇతర నిర్మాణాల నాణ్యతపైనా ప్రజల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వాటిని కూడా స్వతంత్ర సాంకేతిక నిపుణులతో తనిఖీ చేయిస్తేనే వాస్తవాలు బయటపడతాయి అని, ముఖ్యంగా ప్రజల ఆరోగ్యం, విద్య, పరిపాలనకు సంబంధించిన భవనాల విషయంలో నాణ్యతా ప్రమాణాలపై ఎలాంటి రాజీ ఉండకూడదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

అధికారులు స్పందించరా.. చర్యలు తీసుకోరా?

భవన నిర్మాణ సమయంలో పర్యవేక్షణ బాధ్యత వహించిన ఇంజనీరింగ్ అధికారులు, క్వాలిటీ కంట్రోల్ విభాగం నిర్మాణం పూర్తయిన తర్వాత నాణ్యతా పరీక్షలు పూర్తి చేసిన కలెక్టరేట్ నిర్మాణంలో పగుళ్లు ఎలా ఏర్పడ్డాయని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి కలెక్టరేట్ భవనాన్ని సాంకేతిక నిపుణుల బృందం తో సమగ్రంగా తనిఖీ చేయించాలని ప్రజలు కోరుతున్నారు. స్లాబ్‌పై ఏర్పడిన పగుళ్లు, గోడల్లో తేమకు కారణాలను గుర్తించి, నిర్మాణ లోపాలు నిర్ధారణ అయితే బాధ్యులైన కాంట్రాక్టర్‌తో పాటు పర్యవేక్షణ అధికారులపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.భవిష్యత్తు తరాలకు ఉపయోగపడాల్సిన ప్రభుత్వ భవనాలు ప్రారంభోత్సవాలకే పరిమితం కాకుండా దశాబ్దాల పాటు పటిష్టంగా నిలవాలి. కానీ ములుగు జిల్లా కలెక్టరేట్ ప్రారంభమైన కొద్ది రోజులకే ఇలాంటి పరిస్థితులు కనిపిస్తుండటం ప్రజాధనం వినియోగం, అధికారుల పర్యవేక్షణ, కాంట్రాక్టర్ల బాధ్యతపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరిచి వాస్తవాలను వెలికితీస్తారా? లేక పగుళ్లకు మళ్లీ రంగులు వేసి సమస్యను పక్కన పెడతారా? అన్నది వేచి చూడాలి.

డొనాల్డ్ ట్రంప్‌కు
కోర్టుల్లో గట్టి ఎదురుదెబ్బ

న్యూయార్క్, అమెరికాలో మధ్యంతర ఎన్నికల వేళ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు కోర్టుల్లో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కాలిఫోర్నియాలో సుమారు 20 వేల వివాదాస్పద మెయిల్ బ్యాలెట్లను పక్కన పెట్టాలన్న ట్రంప్ ప్రభుత్వ ప్రయత్నాన్ని న్యాయస్థానాలు అడ్డుకున్నాయి. చివరకు అమెరికా సుప్రీంకోర్టు కూడా ట్రంప్ అభ్యర్థనను తిరస్కరించింది.కాలిఫోర్నియాలో సుమారు 20 వేల మంది ఓటర్లు అమెరికా పౌరులు కాకపోవచ్చని ట్రంప్ ప్రభుత్వం అనుమానం వ్యక్తం చేసింది.వీరు ఓటు వేయడానికి అర్హులు కాదని అమెరికా న్యాయశాఖ ఆరోపించింది.ఈ ఓటర్లకు సంబంధించిన బ్యాలెట్లను వెంటనే పక్కన పెట్టాలని రాష్ట్ర ఎన్నికల అధికారులను కోరింది.ట్రంప్ సర్కార్ ఆరోపణలపై కాలి ఫోర్నియా ప్రభుత్వం అభ్యంతరం తెలిపింది. దీనికి కాలిఫోర్నియా పలు అంశాలను లేవనెత్తింది. ఇందులో..కాలిఫోర్నియాలో ఇప్పటికే ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోంది.లక్షలాది మంది ఓటర్లు తమ బ్యాలెట్లను తిరిగి పంపించారు.ట్రంప్ ప్రభుత్వం ఇచ్చిన జాబితాలో అనేక తప్పులున్నాయని కాలిఫోర్నియా అధికారులు వాదించారు.ఆ జాబితాలో అమెరికా పౌరులు, ఓటరు నమోదును క్రియాశీలంగా కొనసాగించని వ్యక్తులు కూడా ఉన్నారని పేర్కొన్నారు.ట్రంప్ ప్రభుత్వం బ్యాలెట్లను వేరు చేయాలంటూ ఫెడరల్ కోర్టును ఆశ్రయించింది.అయితే జిల్లా కోర్టు ఆ అభ్యర్థనను తిరస్కరించింది.ఆ తర్వాత 9వ సర్క్యూట్ అప్పీల్స్ కోర్టులోనూ 2–1 మెజారిటీతో ట్రంప్ ప్రభుత్వానికి చుక్కెదురైంది. ఓటు హక్కు ఉన్నవారి ఓట్లు కూడా చెల్లకుండా పోయే ప్రమాదం ఉందని న్యాయమూర్తులు ఆందోళన వ్యక్తం చేశారునవంబర్ 2, 2026న ట్రంప్ ప్రభుత్వం అమెరికా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. వివాదాస్పద బ్యాలెట్లను తాత్కాలికంగా పక్కన పెట్టాలని అత్యవసరంగా కోరింది.కానీ సుప్రీంకోర్టు ఆ అభ్యర్థనను తిరస్కరించింది.

రెఫరండంగా మారుతొన్న ఎన్నికలు

గుంటూరు, తాజాగా జరిగిన స్థానిక సంస్థల పోలింగ్ ఒకరకంగా ఫస్ట్ ఎపిసోడ్‌గానే చూడాలి. ఎందుకంటే.. అన్ని పార్టీలకూ కీలకమైన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ముందున్నాయి. అయితే.. ఈ ఎన్నికల్లో వాస్తవ పోలింగ్ శాతం గతంతో పోల్చుకుంటే బాగా తగ్గుముఖంపట్టింది. 2021లో జరిగిన స్థానిక ఎన్నికల్లో 69 శాతం మేరకు పోలింగ్ నమోదైంది. దీనితో పోల్చుకుంటే.. ఇప్పుడు సగటున 55 శాతం పోలింగ్ మాత్రమే నమోదైంది. ఈ పరిణామాలు.. అన్ని పార్టీలకూ అనేక విషయాలను నేర్పుతున్నాయని అంటున్నారు విశ్లేషకులు. ఏ పార్టీలో అయినా.. నాయకుల మధ్యకలివిడి ముఖ్యం. కూటమి పార్టీల్లో అధిష్టానాలు పదే పదే చెప్పినా.. ఈ తరహా కలివిడి లేని చోట చాలా వరకు ఓటింగ్ తగ్గిపోయింది. విశాఖ, విజయవాడ వంటి కీలక నగర పాలక సంస్థల పరిధిలో 50 శాతం ఓటు బ్యాంకు కూడా మించలేదు. దీనికి కారణం.. చివరి నిమిషం వరకు కూడా పార్టీలో ఐక్యత సాధించే ప్రయత్నం చేసినా.. దానిని అందుకోలేక పోవడమేనని అంటున్

పవన్ ఇలాకాలో ఏంటీ తేడా...బిగ్ నంబర్ తోనే !



అమరావతి,పిఠాపురం అంటే పవన్ కళ్యాణ్ అన్నంతగా గుర్తింపు వచ్చింది. దానికి కారణం పవర్ స్టార్ గా వెండి తెరను ఏలుతూ రియల్ స్టార్ గా రాజకీయాల్లో తనకంటూ స్థానం సంపాదించుకున్న పవన్ కళ్యాణ్ 2024 ఎన్నికల్లో ఏరి కోరి ఈ సీటు నుంచి పోటీ చేశారు. అక్కడ ఆయన బ్రహ్మాండమైన మెజారిటీతో గెలిచారు. ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను కూడా నిర్వహిస్తూ వస్తున్నారు. ఇక స్థానిక సంస్థలలో భాగంగా పిఠాపురం మునిసిపాలిటీకి జరిగిన ఎన్నికల్లో కూటమి చైర్ పర్సన్ కే జనాలు జై కొట్టారు. అలా జనసేనకు చెందిన దానం లాజర్ బాబు మంచి మెజారిటీతో గెలిచారు. కానీ వార్డులలో కౌన్సిలర్ల దగ్గరే తేడా వచ్చింది. ఏకంగా పది మంది రెబెల్స్ గెలిచి మరీ తమ సత్తా చాటుకున్నారు. దాంతో మూడవ వంతు క్యాండిడేట్లు పార్టీ ఎంపిక చేసిన వారు ఓటమి చవి చూశారు. మరి ఈ తేడా ఎలా జరిగింది, ఎక్కడ లోపం ఉంది అన్నది రాజకీయంగా వాడిగా వేడిగా సాగుతోంది.

జనాలకు నచ్చలేదా :

చైర్మన్ గా జనసేన ఎంపిక చేసిన అభ్యర్థికి ఓటేసి పట్టం కట్టిన జనాలే వార్డుల దగ్గరకు వచ్చేసరికి గాజు గ్లాస్ కి షాక్ ఇచ్చేశారు. తమకు నచ్చిన అభ్యర్థులు రెబెల్స్ అని అంటూ వారినే గెలిపించుకున్నారు. దాంతో జనసేన ఎంపిక జనాలకు నచ్చలేదా అన్నది అంతా ఆలోచిస్తున్నారు. అలాగే బలమైన అభ్యర్థులను వార్డులలో ఎంపిక చేసి అభ్యర్థులుగా నిలబెట్టడంలో జనసేన తడబాటు పడిందా అని కూడా అంతా చర్చించుకుంటున్నారు. పిఠాపురం అంటే ముందే చెప్పినట్లు ఉప ముఖ్యమంత్రి హోదాలో ఉన్న పవన్ సొంత సీటు. అక్కడ ఏమి జరిగినా రాష్ట్రవ్యాప్తంగా చర్చకు ఆస్కారం ఉంటుంది. ప్రస్తుతం దీని మీదనే అంతా డిస్కషన్ చేస్తున్నారు.

కుప్పంలో బాబు అలా :

మరో వైపు చూస్తే చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పం మునిసిపాలిటీలో మొత్తానికి మొత్తం వార్డులు చైర్మన్ సహా అన్నీ కూటమి ఖాతాలోకి వెళ్లాయి. ప్రత్యర్థి వైసీపీ ఇక్కడ ఒక్క సీటూ గెలవలేకపోయింది. అంతే కాదు రెబెల్స్ కూడా ఎవరూ రంగంలో లేరు, ఇక ఏపీ అంతా కూటమి పెద్దన్నగా టీడీపీ అభ్యర్థుల ఎంపిక విషయంలో మధింపు చేసింది అని అంటున్నారు. కానీ పిఠాపురం పవన్ సొంత సీటు కాబట్టి అక్కడ నిర్ణయం అంతా జనసేనకే వదిలేసింది అని అంటున్నారు. అలా 36 వార్డులు ఉన్న పిఠాపురంలో ముందే మూడు వార్డులు ఏకగ్రీవం కాగా మిగిలిన 33 సీట్లకు ఎన్నికలు నిర్వహిస్తే ఫలితాలలో పది మంది రెబెల్స్ గెలిచి వచ్చారు. ఆ విధంగా వారు కూటమికే ఎదురు నిలిచారు. అఫ్ కోర్స్ వారు గెలిచినా కూడా కూటమికి విరుద్ధంగా రంగంలో ఉండటం మాత్రం పార్టీలను ఇబ్బంది పెట్టడమే కాదు సొంత అభ్యర్థుల ఓటమికి కారణం అయ్యారు అని అంటున్నారు.

ఎంపిక సరిగ్గా లేదా :

ఇక పిఠాపురం మున్సిపల్ ఎన్నికల్లో వార్డులలో అభ్యర్థుల ఎంపిక సరిగ్గా జరగలేదా అన్న చర్చ అయితే సాగుతోంది. జనాలు మెచ్చని వారిని ఎంపిక చేయడం వల్లనే బలమైన అభ్యర్థులుగా రంగంలోకి దిగిన రెబెల్స్ విజయం సాధించారు అని విశ్లేషణలు ఉన్నాయి. అదే విధంగా చూస్తే జనసేన స్థానిక నాయకత్వం ఇంతటి సమర్థులైన అభ్యర్థులను ఎందుకు గుర్తించలేకపోయింది బలహీనమైన అభ్యర్థులను ఎలా బరిలోకి దింపింది అన్న ప్రశ్నలు కూడా తలెత్తున్నాయి. ఇది పూర్తిగా పిఠాపురంలో స్థానిక నాయకత్వం తీసుకున్న నిర్ణయాల ఫలితంగా పవన్ కళ్యాణ్ సొంత సీటులో ఇబ్బందులు తలెత్తేలా పరిస్థితులు ఏర్పడ్డాయని అంటున్నారు. టీడీపీ విషయానికి వస్తే అక్కడ బలమైన నేతగా ఉన్న మాజీ ఎమ్మెల్యే వర్మను తప్పించింది. అలాగే జనసేనకు ఏ విధంగానూ ఇబ్బంది లేకుండా ఫ్రీ హ్యాండ్ ఇచ్చేసింది. మరి అలాంటి చోట ఎక్కడా రెబెల్ సౌండ్ వినబడకుండా ఏకతాటి మీద అభ్యర్థుల ఎంపిక చేయాల్సిన పరిస్థితి ఎందుకు లేకుండా పోయింది అని అంటున్నారు.

రెబెల్స్ ని ఏం చేస్తారు :

మరి పిఠాపురంలో రెబెల్స్ అంత పెద్ద ఎత్తున ఎందుకు నిలబడ్డారు అన్నది ఒక ప్రశ్న అయితే వారిని అధినాయకత్వాలు వారించినా మాట వినకుండా ఎందుకు కొనసాగారు అన్నది మరో ప్రశ్న. ఇప్పుడు వారు గెలిచి జెండా ఎగరేశారు, మళ్ళీ వారిని చేర్చుకుంటారా అన్నది కూడా ఇంకో ప్రశ్నగా ఉంది. ఇవన్నీ పక్కన పెడితే తాము టికెట్ ఇవ్వని వారు వద్దు అని చెప్పిన వారు గెలిచి అధినాయకత్వాలకు సవాల్ చేయడం మాత్రం పిఠాపురంలో కొత్త రాజకీయ తలనొప్పిగానే ఉందని అంటున్నారు. ఇప్పటి నుంచే సర్దుకోకపోతే మాత్రం రానున్న కాలంలో ఈ రెబెల్స్ సౌండ్ మరింతగా మరో రూపంలో గట్టిగా వినిపించే చాన్స్ ఉండొచ్చు అని కూడా అంటున్నారు.

విశాఖ డిప్యూటీ మేయర్ మీద బీజేపీ కర్చీఫ్ ?

విశాఖ:విశాఖ ఏపీలో అతి పెద్ద కార్పొరేషన్ అన్నది తెలిసిందే. పైగా విశాఖలో కూటమిలోని మూడు పార్టీలకు సొంతంగా బలం ఉంది. టీడీపీకి కంచుకోట విశాఖ. అలాగే బీజేపీకి కూడా కొన్ని కీలక ప్రాంతాలలో బలం మొదటి నుంచి ఉంది. జనసేనకు సామాజిక రాజకీయ సమీకరణ పరంగా అండదండలు ఉన్నాయి. దాంతో ఈ మూడు పార్టీల కాంబినేషన్ ఎంతా విజయవంతం అయింది అంటే 120 ఉన్న విశాఖ కార్పొరేషన్ లో ఏకంగా 98 వార్డులు గెలుచుకున్నాయి. ఇక ఇండిపెండెంట్లుగా గెలిచిన 8 మంది కూడా కూటమి రెబెల్స్ కావడంతో ఆ బలం కూడా కలుపుకుంటే 106 మంది ఆ వైపే ఉన్నారు. 13 వార్డులను గెలుచుకుని వైసీపీ ప్రతిపక్షంగా ఉండనుంది. ఒక్క సీటులో సీపీఎం గెలిచింది.

డిప్యూటీ కోసం :

ఈ నేపధ్యంలో డిప్యూటీ మేయర్ పదవి కోసం కూటమిలో అతి పెద్ద చర్చ సాగుతోంది. విశాఖ తమకు కీలకమైనది కాబట్టి మేయర్ సీటు ఇవ్వాలని బీజేపీ మొదటి నుంచి కోరుతూ వచ్చింది. 2024 ఎన్నికల్లో ఎంపీ సీటు కూడా ఇవ్వలేదని బీజేపీ టీడీపీ పెద్దల దృష్టికి తీసుకుని వెళ్ళింది. అయితే డిప్యూటీ మేయర్ సీటు హామీ ఆనాడే లభించింది అని ప్రచారం సాగుతోంది. ఈ హామీ మేరకే విశాఖ బీజేపీ అధ్యక్షుడు పరశురాం రాజు కార్పోరేటర్ గా పోటీ చేశారు అని అంటున్నారు. ఇపుడు ఆయనే డిప్యూటీ మేయర్ రేసులో ఉన్నారు అని అంటున్నారు. ఆయనకి ఈ పదవి ఇప్పించేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ గట్టిగా కృషి చేస్తున్నారు అని అంటున్నారు.

జనసేన సైతం :

ఇక ఇదే డిప్యూటీ మేయర్ పదవి కోసం జనసేన కూడా ప్రయత్నం చేస్తోంది. ఆ పార్టీ అయితే 26 కార్పోరేటర్లతో బలమైన రెండవ పార్టీగా ఉంది. దాంతో తమకు ఈ కీలక స్థానం ఇవ్వాలని కోరుతోంది. ఇక బీజేపీ వైపు నుంచి చూస్తే ఆ పార్టీకి ఎనిమిది మంది కార్పోరేటర్లు మాత్రమే ఉన్నారు. దాంతో తమకు చాన్స్ ఇవ్వాలని జనసేన నుంచి డిమాండ్ గా ఉంది. అయితే ఇక్కడ సంఖ్యాబలం



ప్రాధాన్యత కాదని బీజేపీకే అవకాశం ఉండొచ్చు అని ఆ పార్టీ ధీమాగా ఉంది. ఉత్తరాంధ్రాలో మూడు కార్పోరేషన్లు ఉన్నాయి. విశాఖ విజయనగరం టీడీపీ సొంతం అయ్యాయి. త్వరలో శ్రీకాకుళం కార్పోరేషన్ ఎన్నికలు ఉన్నాయి. అది జనసేనకు ఇచ్చారు. అలా జనసేనకు ఉత్తరాంధ్రాలో మేయర్ సీటు ఉంటుందని అంటున్నారు. అవసరం అయితే విజయనగరం డిప్యూటీ మేయర్ పీఠం ఇస్తారని చెబుతున్నారు. అలా మూడు పార్టీలూ కూటమిలో సమ న్యాయం చేసుకుంటాయని చెబుతున్నారు.

కాషాయం పార్టీ ప్లాన్ :

దీంతో విశాఖ మేయర్ పీఠం టీడీపీకి వెళ్తే డిప్యూటీ మేయర్ పీఠం బీజేపీకి దక్కుతుందని అంటున్నారు. బీజేపీ నుంచి 1980 లో మేయర్ తొలిసారి విశాఖ కార్పోరేషన్ అయ్యాక నెగ్గారు. మళ్ళీ ఇన్నేళ్ళకు డిప్యూటీ మేయర్ పీఠం దక్కితే తమకు సగం బలం అయినా విశాఖలో దక్కుతుందని రానున్న ఎన్నికల్లో పాటు వేసుకుంటోంది. చూడాలి మరి బీజేపీకి దక్కుతుందని ప్రచారంలో ఉన్న ఈ డిప్యూటీ మేయర్ సీటు ఎంత దూరమో మరెంత ఎంత దగ్గరో.

ఎల్‌నినో ఎఫెక్ట్.. ఆన్‌లైన్ తరగతులు తప్పవా?



విద్యార్థుల వసతి సదుపాయాలపై ఆందోళన నెలకొనడంతో మెజారిటీ కళాశాల యాజమాన్యాలు ఆన్‌లైన్ తరగతులు నిర్వహించడానికే మొగ్గు చూపుతున్నాయి. ఈ క్రమంలో వీసీల రివ్యూ సమావేశంలో ఆయా యూనివర్సిటీల పరిధిలోని పరిస్థితులు, విద్యా సంవత్సరం కుదింపు, ఆన్‌లైన్ బోధనకు ఉన్న అవకాశాలు, విద్యార్థుల అందుబాటు వంటి అంశాలపై సమగ్రంగా చర్చించనున్నారు. అనంతరం ఉన్నత విద్యామండలి దీనిపై అధికారిక ఉత్తర్వులు విడుదల చేసే అవకాశం ఉంది. ఇప్పటికే నీటి ఎద్దడి కారణంగా నిర్మల్ జిల్లా బాసరలోని ట్రిపుల్ ఐటీకి దసరా సెలవులను పొడిగించి, ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. బాసర ట్రిపుల్ ఐటీలో సుమారు 9 వేల మంది చదువుతున్నారు. రోజుకు దాదాపు 25 లక్షల లీటర్ల నీరు అవసరమని గుర్తించిన అధికారులు సెలవులు పొడిగించినట్లు తెలుస్తోంది.

ఇప్పటికే కార్పొరేట్ కాలేజీల సెలవులు..

రాష్ట్రంలోని కార్పొరేట్ జూనియర్ కాలేజీలు మళ్లీ తమ పాత ధోరణినే అవలంబిస్తున్నాయి. రాష్ట్రంలో నీటి ఎద్దడిని సాకుగా చూపిస్తూ, పండగ సెలవులను ముందస్తుగానే ప్రకటించి ఆన్‌లైన్ తరగతులను నిర్వహిస్తున్నాయి. దీపావళి పండుగ సందర్భంగా ముందస్తుగానే కాలేజీలకు సెలవులు ప్రకటించిన యాజమాన్యాలు, విద్యార్థులను ఇళ్లకు పంపించాయి. అయితే, ఆన్‌లైన్ తరగతులు ఎన్నిరోజులపాటు నిర్వహిస్తారనే దానిపై ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవ డంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర అయోమయానికి గురవుతున్నారు. సెలవుల్లోనూ డిజిటల్ స్క్రీన్‌ల ముందే గడపాల్సి రావడం వల్ల విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తమవుతోంది.వేలాది మంది విద్యార్థులున్న హాస్టళ్ల కు రోజూ సరిపడా నీటిని సమకూర్చడం ఇబ్బందిగా మారిందని హైదరాబాద్‌లోని హైదరాబాద్,రాష్ట్రంలోని యూనివర్శిటీలు, అన్ని రకాల వృత్తి విద్యా కాలేజీల్లో ఆన్‌లైన్ తరగతులు నిర్వహించే ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నట్లు ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి తెలిపారు. అయితే దీనిపై తొందరపడి ఎలాంటి నిర్ణయం తీసుకోమని, ఆయా యూనివర్సిటీల వైస్ చాన్స్‌లర్లతో పూర్తిస్థాయి సమీక్ష నిర్వహించిన తర్వాతే తుది నిర్ణయం ప్రకటిస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో నీటికొరత ఉన్న నేపథ్యంలో కొన్ని విద్యాసంస్థలు సెలవులు ఇచ్చి, ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

విద్యార్థులంతా హాస్టళ్లలోనే..

విద్యార్థుల ప్రయోజనాలు, విద్యా సంవత్సరం క్యాలెండర్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రతిపాదనలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా చాలామంది విద్యార్థులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చి కాలేజీ హాస్టళ్లు, ప్రైవేట్ వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో హాస్టళ్ల నిర్వహణ,

అమెరికా ఎన్నికలు – ట్రోలింగ్ అవుతున్న జ్ఞానేష్

న్యూఢిల్లీ,అమెరికా మిడ్ టర్మ్ ఎన్నికల ఫలితాల్లో అధికారంలో వున్న ట్రంప్ పార్టీ ఓటమి పాలయ్యింది. తగువులమారి తెంపరి ట్రంప్ కు తలబొప్పి కట్టింది. ఎక్కడో అమెరికాలో ఎన్నికలు జరిగి ప్రెసిడెంట్ ట్రంప్ పార్టీ ఓడిపోతే ఇక్కడ ఇండియాలో ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ గుర్తు చేసుకుంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తుండటం ఆశ్చర్యం కలిగించే విషయం.అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాలతో ట్రంప్‌ను వెక్కిరించేలా రూపొందించిన ఏఐ వీడియోలు, ఫొటోలతో ట్రోలర్లు సోషల్ మీడియాలో రెచ్చిపోయారు. భారతదేశంలో కొన్ని నెలలుగా ఓట్ చోరీ గురించి ఆందోళనలు జరుగుతున్న సంగతి తెలిసిందే. కేంద్రంలో మోదీ వరస విజయాల వెనక జ్ఞానేష్ కుమార్ చేతివాటం వుందని కాంగ్రెస్, కాక్రోచ్ జనతా పార్టీలు పార్టీలు ఆరోపణలు గుప్పిస్తున్నారు.ఈ నేపథ్యంలో అమెరికా ఎన్నికల ఫలితాలు వారికి అందివచ్చినట్టయ్యింది. జ్ఞానేశ్‌కుమార్ అయితే ట్రంప్‌కు ఇలా జరగనిచ్చేవారు కాదంటూ సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఎక్స్‌లో పోస్టు చేశారు. మిత్రమా ట్రంప్.. జ్ఞానేష్ ను నీ దగ్గరకు పంపలేకపోయినందుకు క్షమించంటూ ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఇవి సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నాయి.ఇక జ్ఞానేష్ కుమార్ ను జైలుకు పంపిస్తామని ప్రకటించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అమెరికా ఎన్నికలపై స్పందించారు. అమెరికా తరహా మార్పు ఇండియాలో కూడా సాధ్యమే అని చెప్పారు. యెస్.. వి కెన్ టూ అంటూ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎక్స్ లో మెసేజ్ పెట్టి తమ ఉత్సాహం ప్రదర్శిస్తున్నారు. భారత్‌లోనూ ఇలాంటి రాజకీయ మార్పు త్వరలోనే వస్తుందని



కాంగ్రెస్ అధికార ప్రతినిధి డాక్టర్ శామా మహమ్మద్ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబించే పార్టీలకు గుణపాఠం తప్పదని హెచ్చరించారు.మొత్తమ్మీద దేశంలో ఇప్పుడు సీఈసీ జ్ఞానేష్ కుమార్ కు కూడా ఫ్యాన్స్ ఏర్పడ్డారని, మోదీ, అమిత్ షా కంటే ఎక్కువ క్రేజ్ వచ్చిందని సోషల్ మీడియాలో కామెంట్స్ వైరల్ అవుతున్నాయి.

అల్వాల్ రైతుబజార్ను తొలగించవద్దు

మేడ్చల్:అల్వాల్ రైతుబజార్ను తొలగిస్తే 1,500 రైతు కుటుంబాలకు నష్టం కలుగుతుందని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ను రైతులు కలిసారు. అల్వాల్ రైతుబజార్ను ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కోసం తొలగించనున్న నేపథ్యంలో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పోలవరం ...గోదావరి మీద అద్భుత నిర్మాణం !



అమరావతి,ఏపీకి జీవనాడిగా వర ప్రదాయినిగా ఉన్న పోలవరం డ్యాం నిర్మాణం 2027 నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం గట్టి సంకల్పంతో ఉంది. దాని కోసం శరవేగంగా పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. ఇప్పటికి అయితే 90 శాతం మేర పనులు పూర్తి అయ్యాయని తెలుస్తోంది. అన్నీ అనుకూలిస్తే 2027 గోదావరి పుష్కరాలకు ముందే ఈ డ్యామ్ పూర్తి అయి ఆంధ్ర జాతికి అంకితం అవుతుంది. ఇంతటి పెద్ద బహుళార్ధక సాధక ప్రాజెక్ట్ ని ఎలా నిర్మిస్తున్నారు అన్నది ఎవరికీ ఊహకు కూడా అందదు. నిజానికి ఆ ఆలోచన కూడా ఎవరూ చేయరేమో. అయితే ఆ విషయాలు తెలుసుకుంటే మాత్రం పోలవరం ఒక అద్భుతమైన నిర్మాణం అని అందరికీ కచ్చితంగా బోధపడుతుంది.

అసలు ఎలా సాధ్యం :

గోదావరి అంటేనే అతి పెద్ద జీవనది. అది మహారాష్ట్రలో పుట్టినపుడు చిన్నగా మొదలవుతుంది. కానీ తెలంగాణాను దాటి ఏపీ వైపుగా మళ్ళినపుడు అఖండ గోదావరి అవుతుంది. దాంతో ఉరుకులు పరుగులతో సముద్రం వైపుగా సాగుతుంది. అలాంటి గోదావరి నది మీద పోలవరం ప్రాజెక్ట్ కట్టడం అంటే ఎలా సాధ్యం అన్నది వెరీ ఇంట్రెస్టింగ్ మ్యాటర్. దాని వెనక ఉన్న ఇంజనీరింగ్ పనితనం గురించి బహుశా అత్యధిక శాతం మందికి తెలియదు. అసలు గోదావరి నది మీద ఈ డ్యామ్ ని ఎలా కడుతున్నారు, ఇది సాధ్యమేనా అంటే ఇక్కడే ఇంజనీరింగ్ అద్భుతమైన పనితనం దాగి ఉంది. ఆ విశేషాలు ఏంటో తెలుసుకుంటే వామ్మో అనిపించకమానదు. నిజానికి జోరుగా పారుతున్న గోదావరినీటిలో డ్యామ్ కట్టడం అన్నది సాధ్యం కానే కాదు. అందుకే నదిని దారి మళ్ళిస్తారు.

స్పిల్ వే అంటే అదే :

గోదావరి నీరు ప్రవహిస్తుంటే పునాదులు వేసి డ్యామ్ కట్టడం అసాధ్యం కాబట్టే నది నీటిని ప్రక్కకు మళ్ళించడానికి ఒక కృత్రిమ మార్గాన్ని సృష్టించారు. అలా నది పక్కన పొడి నేలలో 48 గేట్లతో అతి పెద్ద కాంక్రీట్ నిర్మాణమే జరిగింది. దాని పేరే స్పిల్ వే. ఆ తరువాత నదికి అడ్డంగా పైన ఒకటి దిగువన ఒకటి రెండు కాఫర్ డ్యాములను వేశారు. ఇలా గోదావరిని తన దారిని మార్చేలా చేసి స్పిల్ వే వైపుగా నదీ ప్రవాహాన్ని మళ్ళించారు అన్న మాట. ఇలా గోదావరి తన దారి అంతా మార్చుకుంటే అలా వదిలేసిన ప్రాంతం అంతా తడి నేలగా మారుతుంది. అలా బయటపడిన నది నేలలో నిర్మాణం చేపట్టడం కూడా చాలా కష్టమైన వ్యవహారంగానే ఉంటుంది. ఎందుకంటే నది నేల కింద అంతా ఇసుకతో నిండి ఉంటుంది కానీ గట్టి రాయి అన్నది కనిపించదు. లోతుల్లో దాకా తడి ఇసుకే ఉంటుంది. ఇక్కడ డ్యామ్ కట్టినా పైన నీళ్ళు ఆగినా ఇసుకలో నుంచి అలా లీక్ అయిపోతాయి.

డయాఫ్రమ్ వాల్ కీలకం :

అందుకే నది ఇసుక తిన్నెల కింద నీరు ఊరటం లేదా లీకేజీ అవ్వడం జరగకుండా ఉండటానికి నది గర్భంలో 40 నుండి 95 మీటర్ల లోతు వరకు కాంక్రీట్‌తో డయాఫ్రమ్ వాల్ నిర్మిస్తున్నారు. ఇలా ట్రెంచ్ కట్టర్ అనే మిషన్ నుంచి రాయి తగిలేంతవరకూ లోతుల వరకూ ఒక గుంత తవ్వుతారు. అది కూలిపోకుండా బురదతో నింపి ఆ తరువాత కాంక్రీట్ పోస్తారు. నది గర్భంలోని ఇసుకను భారీ యంత్రాలతో గట్టిగా పటిష్టం చేసి అక్కడ భూమిని పటిష్టంగా మారుస్తారు. ఈ పటిష్టమైన గోడనే డయాఫ్రమ్ వాల్ అని పిలుస్తారు. దానిని పునాది అనుకుంటే కొన్ని లక్షల టన్నుల బరువైన బంకమట్టి పెద్ద పెద్ద రాళ్లను దాని మీద పొరలు పొరలుగా వేస్తూ రోలర్లతో తొక్కిస్తూ 50 మీటర్ల ఎత్తు వరకూ తీసుకుని వస్తారు. అలా ప్రధానమైన డ్యామ్‌ను నిర్మిస్తున్నారు అన్న మాట.

భారీ వరదలు వచ్చినా :

ఇక చూస్తే 2020 వరదలలో పైన ఉన్న కాఫర్ డ్యామ్ కొట్టుకుని పోయి పాత గోడ పూర్తిగా దెబ్బ తింది. అందుకే కొత్త గోడను మళ్ళీ కట్టాల్సి వచ్చింది అని జలవనరుల శాఖ నిపుణులు చెబుతున్నారు. ఇలా పటిష్టంగా నిర్మించిన ఆ డయాఫ్రమ్ వాల్ మీదనే అసలు డ్యామ్ కడుతున్నారు అన్న మాట. ఇక ఈ మధ్యలో ఉన్న మట్టి నీళ్ళను ఆపుతుంది. ఇక దాని చుట్టూ ఇసుక మధ్యలో రాళ్ళు ఉంటాయి. ఇక ట్రక్కులు పోసి రోలర్లు తొక్కుతూ పొర మీద పొరని అలా వేసుకుంటూ అత్యంత పటిష్టం చేస్తాయి. ఇంతలా సాగిన ఈ నిర్మాణంలో పెద్ద వరదలు వస్తే ఏమిటి సంగతి అన్నది కూడా ఉంటుంది కదా. హైడ్రాలిక్ సిలిండర్లు గేట్లను అత్యవసర సమయంలో ఒక్కసారిగా పైకి లాగుతాయి. దాంతో వరద నీళ్ళు డ్యామ్ ని తాకకుండా స్పిల్ వే ద్వారా బయటకు పోతాయి. ఇక ఆగిన నీళ్ళు అయితే కుడి కాలువ నుంచి విజయవాడ వైపు ఎడమ కాలువ నుంచి విశాఖ వైపుగా పరుగులు తీస్తాయి. ఇక ఇక్కడే విద్యుత్ ని కూడా ఉత్పత్తి చేస్తారు. చెబుతూంటేనే ఎంతో ఆసక్తిని పెంచే పోలవరం నిర్మాణం అయితే ఒక యజ్ఞం అన్న మాట. పోలవరం దాదాపుగా తొంభై ఏళ్ళ కల. ఇన్నేళ్ళకు అది సాకారం కాబోతోంది అంటే దానిని చూస్తున్న ఈ తరం చాలా అదృష్టం. ప్రయోజనం పొందే భావి తరాలు కూడా ధన్యం అని చెప్పాల్సిందే.

ఎన్టీఆర్ ఆత్మ గౌరవ నినాదం...కేటీఆర్ కామెంట్స్ వెనక ?

హైదరాబాద్,దివంగత నాయకుడు, ఉమ్మడి ఏపీకి దాదాపుగా ఎనిమిదిన్నరేళ్ళ పాటు పాలించి మూడు సార్లు ముఖ్యమంత్రి అయిన ఎన్టీఆర్ రాజకీయాల్లోకి రావడానికి కొన్ని కీలక పరిణామాలు ఆనాడు దారి తీశాయి. అందులో ముఖ్యమైనది ఆత్మ గౌరవం. తెలుగు వారికి ఆత్మగౌరవం అంతా ఢిల్లీ పెద్దలకు తాకట్టు పెడుతున్నారు అని ఎన్టీఆర్ ఆనాడు ఉమ్మడి ఏపీ అంతా తిరిగి నలు చెరగులా ప్రచారం చేశారు. అది వజ్రాయుధంగా మారి అప్పటికి మూడు దశాబ్దాల పైగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూకటి వేళ్ళతో కూల్చి వేసింది. అలా పార్టీ పెట్టిన తొమ్మిది నెలలలోనే టీడీపీ అధికారం అందుకుంది అంటే దాని వెనక అంతటి పవర్ ఫుల్ నినాదం ఉంది అన్న మాట.

కేటీఆర్ మాటలలో :

మళ్ళీ ఇన్నాళ్ళకు ఆ నినాదం బీఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నోట వినిపిస్తోంది. తాజాగా ఆయన పార్టీ సమావేశాలలో మాట్లాడుతూ కాంగ్రెస్ బీజేపీ నేతలు ఇద్దరూ ఢిల్లీలో వారి పార్టీ అధినేతల ముందు తల వంచుతున్నారని ఘాటు కామెంట్స్ చేశారు. ఢిల్లీ వెళ్ళిన కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గాంధీల చుట్టూ తిరుగుతున్నారని విమర్శించారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి అన్నది లేకుండా కాంగ్రెస్ అగ్ర నేతల ముందు భయపడిపోతున్నారని నిందించారు. ఇది తెలంగాణా ఆత్మ గౌరవం కాదా అన్నారు.

కేంద్ర మంత్రిగా ఉంటూ :

తెలంగాణకు కేంద్ర మంత్రి అమిత్ షా వస్తే కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆయనకు దారి సరి చేస్తూ పాదయాత్రలో వ్యవహరించిన తీరుని కూడా కేటీఆర్ తప్పుపట్టారు. అసలు రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రిగా బండి సంజయ్ కి కేంద్ర మంత్రిగా తాము ఉన్నామని గమనించుకోవాలని ఆయన సూచించారు. బీజేపీ అయినా కాంగ్రెస్ అయినా అగ్ర నేతలు తెలంగాణా నాయకులను తగ్గించి చూస్తున్నారు అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విధంగా తెలంగాణ ఆత్మ గౌరవాన్ని దెబ్బ తీస్తున్నారు అని అన్నారు. కాంగ్రెస్ సంచులు మోసే పార్టీగా బీజేపీ చెప్పులు మోసే పార్టీగా మారిందని హాట్ కామెంట్స్ చేశారు.

మనమే ఉండాలి :



తెలంగాణా ఆత్మ గౌరవం నిలబెట్టాలీ బీఆర్ఎస్ మాత్రమే ఉండాలని ఆయన అన్నారు. ఢిల్లీ పాలకులను నిలదీయాలంటే బలమైన ప్రాంతీయ పార్టీల అవసరం అని ఆయన చెప్పుకొచ్చారు. తెలంగాణా ప్రజల ఆత్మ గౌరవాన్ని దెబ్బ తీసే జాతీయ పార్టీలను అంతా వ్యతిరేకించాలని కేటీఆర్ కోరారు. ఆయన అలా నినదించడం ఇపుడు కొత్త చర్చకు దారి తీస్తోంది. తెలంగాణాలో రెండు జాతీయ పార్టీల మధ్యలో బీఆర్ఎస్ అనే ప్రాంతీయ పార్టీ ఉంది. ఆ రెండు జాతీయ పార్టీలు ప్రజలకు మేలు చేయలేవని ప్రచారం చేస్తూ వచ్చిన బీఆర్ఎస్ ఇపుడు రూట్ మార్చింది అని అంటున్నారు.

నినాదానికి పదును :

ఆత్మ గౌరవ నినాదం తీసుకుని వస్తోందని గుర్తు చేస్తున్నారు. ఈ నినాదం ఎన్టీఆర్ టీడీపీకి ఇంధనంగా పనిచేసింది. అదే తీరున బీఆర్ఎస్ జనంలోకి వెళ్లాలని చూస్తోందా అన్న చర్చ సాగుతోంది. ముఖ్యంగా తెలంగాణా రాష్ట్ర సాధన అంతా నీరు నిధులు నియామకాలతో పాటు ఆత్మ గౌరవ పోరాటం మీదనే ఆధారపడి సాగింది. అందుకే బీఆర్ఎస్ మరోసారి ఈ నినాదానికి పదును పెడుతోంది అని అంటున్నారు. అయితే హైకమాండ్ కి జవాబు దారీగా ఉండడంలో తప్పేంటి అని కాంగ్రెస్ బీజేపీ నేతలు ప్రశ్నిస్తున్నారు. వక్ర భాష్యాలు బీఆర్ఎస్ చేస్తోంది అని విమర్శిస్తున్నాయి.

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140